PRAJASAKTI Regd.No. 15795/68
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
సిటీ◆
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 42 సంచిక : 197 | విజయవాడ, శనివారం 18 ఫిబ్రవరి 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Saturday 18 February 2023 | Rs

అదానీకి వంత
- ముడి బొగ్గు సరఫరా కాంట్రాక్టు పొడిగింపు
- కాంట్రాక్టు విలువ రూ.600 కోట్లు పైనే

లోపలి పేజీలో..

ఎస్ఐ పోస్టులకు 19న రాత పరీక్ష
ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎస్ఐ పోస్టుల భర్తీ కోసం రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆదివారం నాడు నిర్వహించే పరీక్షకు మొత్తం 1,71,936 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 291 కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షలకు రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు అన్ని ఏర్పాట్లనూ పూర్తి చేసింది. రెండు పేపర్లుగా జరిగే ఈ పరీక్షలకు రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు విధి విధానాలను శుక్రవారం విడుదల చేసింది. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షా సమయం అని, అభ్యర్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించింది. ముందు రోజు కూడా పరీక్షా కేంద్రాలను పరిశీలించుకోవాలని కోరింది. ఒక్క నిమిషం ఆలస్యాన్ని కూడా అనుమతించబోమని తెలిపింది. ల్యాప్ టాప్, సెల్‌ఫోన్‌లు, పెన్‌డ్రైవ్, బ్లూటూత్, స్మార్ట్ వాచ్, క్యాలిక్యులేటర్, లాగ్‌బుక్, వాలెట్, నోట్స్ ఇలా ఏ రకమైన వస్తువులనూ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని పేర్కొంది.

చంద్రబాబు పర్యటనలో ఉద్రిక్తత
- అడ్డుకునేందుకు రోడ్డుపై బైఠాయించిన పోలీసులు
- ప్రతిఘటించిన టిడిపి శ్రేణులు


అనపర్తి దేవీచౌక్ వద్ద సభలో జనరేటర్లను ఆపేయడంతో మొబైల్ లైట్ల వెలుతురులోనే ప్రసంగిస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం, కాకినాడ ప్రతినిధులు

తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గంలో చంద్రబాబు రోడ్ షోను అడుగడుగునా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కాకినాడ జిల్లా సామర్లకోట నుంచి బలభద్రపురం వరకూ వచ్చిన చంద్రబాబు కాన్వాయ్‌ను కొద్ది దూరంలో అడ్డుకున్నారు. అనపర్తిలో సభకు అనుమతి రద్దు చేశామని అప్పటికప్పుడు చెప్పారు. ముందుకు వెళ్లనీయబోమంటూ రోడ్డుపై పోలీసులు బైఠాయించారు. దీంతో, చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అక్కడి నుంచి కాలినడకన సుమారు ఏడు కిలోమీటర్లు నడిచి సభాస్థలికి చేరుకున్నారు. వేలాది మంది కార్యకర్తలు ముందు నడిచి బారికేడ్లను తోసుకుని వెళ్తూ చంద్రబాబును ముందుకు నడిపించారు. అనపర్తి దేవిచౌక్ వద్ద మాజీ ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి రోడ్డుపై బైఠాయించి పోలీసుల తీరుపై నిరసన తెలిపారు. ఉద్రిక్తతల నడుమ చంద్రబాబు అనపర్తిలోని దేవీచౌక్ సెంటర్‌లో బహిరంగ సభ ప్రాంతానికి చేరుకున్నారు. ఈ సమయంలో జనరేటర్లకు తాళాలు వేసి ఆపరేటర్లను పోలీసులు అక్కడి నుంచి తీసుకుపోయారు. దీంతో, వెలుతురు కోసం టిడిపి కార్యకర్తలు తమ సెల్ ఫోన్ల లైట్లను ఆన్ చేశారు. టిడిపి నేతలు తాళాలు పగలగొట్టి జనరేటర్లను ఆన్ చేయించారు. జనరేటర్లను ఆపేందుకు పోలీసులు ప్రయత్నించడంతో కార్యకర్తలు అడ్డుకున్నారు. అనంతరం చంద్రబాబు ప్రసంగించారు.

సైకో పాలనలో ప్రజా జీవనం అస్తవ్యస్తం
రాష్ట్రంలో సైకో పాలనలో ప్రజా జీవనం అస్తవ్యస్తంగా మారిందని మిగతా 2 లో


ఫోటో : కె నరహరి

అచ్ఛేదిన్ కాదు...అంధకారం
దోపిడికే మోడీ సహకారం
వ్యవసాయ కార్మికసంఘం బహిరంగసభలో పినరయి విజయన్

హౌరా నుండి ప్రజాశక్తి ప్రతినిధి

మోడీ పాలనలో దేశానికి అచ్ఛేదిన్ కాదు ... అంధకారం వచ్చిందని కేరళ సిఎం పినరయి విజయన్ అన్నారు. అఖిల భారత వ్యవసాయ కార్మికసంఘం 10వ మహాసభ సందర్భంగా హౌరాలోని బిజయోనంద పార్కు(సమర్ ముఖర్జీవేదిక)లో శుక్రవారం బహిరంగ సభ నిర్వహించారు. అంతకుముందు హౌరామైదాన్‌లోని శరత్‌సదన్ నుండి విజయానంద పార్కు వరకూ భారీ ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనకరు బెంగాల్లోని వివిధ ప్రాంతాల నుండి వ్యవసాయ కార్మికులు పెద్దఎత్తున తరలివచ్చారు. రెండు కిలోమీటర్ల దూరం సాగిన ప్రదర్శనకు అడుగడుగునా ఘనస్వాగతం లభించింది. అనంతరం ఆహ్వాన సంఘం నాయకులు, బెంగాల్ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి అమియపాత్రో అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో విజయన్ మాట్లాడుతూ అచ్ఛేదిన్ అని చెబుతూ మోడీ దేశాన్ని అంధకారంలోకి నెడుతున్నారన్నారు. ఫలితంగా పేదల సంఖ్య పెరుగుతోందని చెప్పారు.

స్వామి వివేకానంద, రవీంద్రనాథ్‌ఠాగూర్, ఎంఎన్‌రాయ్, ప్రమోద్‌దాస్ గుప్తా, జ్యోతిబసు వంటి అపురూప వ్యక్తులకు జన్మనిచ్చిన బెంగాల్ దేశానికి గర్వకారణమని తెలిపారు. వీరిలో ఎక్కువమంది స్వాతంత్ర్య పోరాటకాలంలో జైలుశిక్ష అనుభవించారని అటువంటి వారి జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. ఈసందర్భంగా బెంగాల్‌లో జరిగిన వివిధ రైతాంగ, ప్రజా పోరాటాలను ఆయన ప్రస్తావించారు. బెంగాల్ రైతు ఉద్యమం మత సామరస్యాన్ని దేశ వ్యాప్తం చేసిందని చెప్పారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న నరేంద్రమోడీ ప్రభుత్వం ఆ రైతాంగ ఉద్యమ లక్ష్యాలను నీరుగార్చడంతో పాటు, ప్రజానీకంలో మత విద్వేషాలను రెచ్చగొడుతోందన్నారు. ఈ విధానాలను ప్రతిఘటిస్తూ, ప్రజలను ఐక్యం చేయాల్సిన బాధ్యత ప్రగతిశీల శక్తులపై ఉందన్నారు. మరోవైపు పెద్దఎత్తున అవినీతిని పెంచి పోషిస్తు న్నారని, మోడీ ప్రభుత్వంతో పాటు,బెంగాల్‌లోని టిఎంసి ప్రభుత్వం కూడా కార్పొరేట్, మతోన్మాద శక్తుల అనుకూల పాలన సాగిస్తోందన్నారు. ఈ విధానాలకు భిన్నంగా కేరళ ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గంలో పయనిస్తోందని చెప్పారు. మత ఘర్షణలు లేని రాష్ట్రంగా నిలిచిందని చెప్పారు. అలాగే పాఠశాల విద్య, శాంతి భద్రతలు, అతితక్కువ శిశు మరణాలు లేని రాష్ట్రంలోగా ఉందని పేర్కొన్నారు. అలాగే ఉపాధి కల్పనలోనూ ముందుందని చెప్పారు . వ్యవసాయ కార్మికులకు దేశంలోనే ఎక్కువ వేతనాలు కేరళలో లభిస్తున్నాయని చెప్పారు. . రైతులకు రాయితీలు ఇస్తున్నట్లు తెలిపారు. ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉన్నప్పటికి కేరళలో ధరలు అందుబాటులో ఉంచామని చెప్పారు. ప్రత్యామ్నాయ పాలనకు కేరళ నిదర్శనంగా ఉందని అన్నారు. అదే సమయంలో కేంద్రప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని, ఫెడరలిజం అర్థాన్నే మార్చేస్తోందని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంకాని వారు నేడు అధికారంలో ఉన్నారన్నారు. వలసపాలకుల కాళ్లకు మొక్కినవారు నేడు వినాశకర పాలన చేస్తున్నారని వివరించారు. ఒకేదేశం, భాష, ఒకే ఎన్నికలు అంటూ సమాఖ్య వ్యవస్థను దెబ్బతీస్తున్నారన్నారు. బిజెపియేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాలను రకరకాలుగా వేధిస్తోందని, గవర్నర్ కార్యాలయాన్ని కూడా దుర్వినియోగం చేస్తోందన్నారు. బిజెపికి, నరేంద్రమోడీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్న వారిపై పెద్దఎత్తున అణచివేత విధానాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా బిబిసి కార్యాలయంపై జరుగుతున్న ఐటి దాడులను ఆయన ప్రస్తావించారు. భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తున్నారని అన్నారు. ప్రజలకు జీవనోపాధి కావాలని, దానికి అనువైన వాతావరణం ఏర్పడాలని తెలిపారు. మత ఎజెండాకు వ్యతిరేకంగా ప్రజల ఐక్యత రావాలని చెప్పారు. వ్యవసాయ కార్మికులు, రైతులు జాతీయ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని, భవిష్యత్‌లో నిర్వహించే పోరాటాల్లోనూ వారిపాత్రే కీలకమని అన్నారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ మాట్లాడుతూ కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ప్రకటించారు. దీనిలో పెద్దఎత్తున కలిసి రావాలని కోరారు. బెంగాల్లో మమతా బెనర్జీ నియంతృత్వ పాలన చేస్తున్నారని, దీనిని ఏ మాత్రమూ సహించబోమన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు విజయరాఘవన్ మాట్లాడుతూ కేరళ పాలనను ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు,. అక్కడ సామాన్య ప్రజలకు రక్షణ ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం, ఎఐకెఎస్ నాయకులు బిమన్‌బసు తదితరులు పాల్గొన్నారు.

లోపాలు లేకుండా ఇళ్లు
- 'లే అవుట్ల'లో సచివాలయాలదే కీలక పాత్ర
- గృహ నిర్మాణశాఖ సమీక్షలో సిఎం వైఎస్ జగన్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పేదల కోసం నిర్మిస్తున్న ఇళ్లలో ఎటువంటి లోపాలు ఉండకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన గృహ నిర్మాణ శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ' సొంత ఇళ్లు పేద వాడి కల. దానిని సజావుగా వాస్తవం చేయాలి. అత్యంత నాణ్యతతో నిర్మించాలి' అని అన్నారు. ఇళ్ల నిర్మాణం కోసం సిద్ధం చేస్తున్న లే అవుట్లలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని, వాటి నిర్వహణలో గ్రామ, వార్డు సచివాలయాలు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఇళ్ళ నిర్మాణాల నాణ్యతను పరీక్షించేందుకు ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ల్యాబ్‌లను వాడుకోవాలన్నారు. మూడున్నరేళ్లలో పేదలకు సొంతింటి కలను నిజం చేసేందుకు గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. ఇళ్ల నిర్మాణాల కోసం ఉచితంగా ఇసుక పంపిణీ, తక్కువ ఖరీదుకే సామాగ్రిని అందించడంతో కలిగిన ప్రయోజనంతో మొత్తం ఖర్చు రూ.13.780కోట్లు అని, ఇళ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టడానికి కాలనీల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.3,117కోట్లు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ ,రహదారుల సదుపాయాల కోసం మరో రూ.32,909కోట్లు ఖర్చు చేసినట్లు సిఎం పేర్కొన్నారు. కేవలం జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కోసం రూ.36,026కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణ ఖర్చు కింద మౌలిక సదుపాయాల కోసం ఈ మూడున్నర సంవత్సరాల్లోనే రూ.8,734 కోట్లు ఖర్చు చేశామని దీంతో పాటు 300 అడుగుల ఇళ్లను ఉచితంగా ఇవ్వడంతో దాదాపు రూ.10,339 కోట్ల రూపాయాల లబ్ధి పేదలకు జరిగిందని సిఎం పేర్కొన్నారు. వీటితో పాటు రిజిస్ట్రేషన్ చార్జీలను కూడా తొలగించి ఉచితంగా ఇళరిజిస్ట్రేషన్ చేయించడం ద్వారా మరో రూ.1200 కోట్ల భారాన్ని ప్రభుత్వం తీసుకుందని సిఎం తెలిపారు. సమీక్షలో గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎపి స్టేట్ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ లిమిటెడ్‌ఛైర్మన్ దవులూరి దొరబాబు, టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, మున్సిపల్ శాఖ స్పెషల్ సిఎస్ శ్రీలక్ష్మీ, హౌసింగ్ స్పెషల్ సిఎస్ అజయ్‌జైన్, ఆర్థిక శాఖ కార్యదర్శి కెవివి. సత్యనారాయణ, గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దివాన్ మైథిన్, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి లక్ష్మీషా, టిడ్కో ఎండి శ్రీధర్, మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్ విజి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మేమే నిపుణులను ఎంపిక చేస్తాం
- అదానీ వ్యవహారంలో కేంద్రానికి 'సుప్రీం' షాక్
- 'సీల్డ్ కవర్' పేర్లకు తిరస్కరణ

లోపలి పేజీలో..

టీమ్ జార్జి కలకలం
- 33 దేశాల్లో ఎన్నికల ప్రభావితం
- ఆ జాబితాలో భారత్ కూడా?
- బిజెపిపై అనుమానాలు

ఇద్దరు ముస్లిం యువకుల
సజీవదహనం
రాజస్థాన్‌లో బజరంగ్‌దళ్ గూండాల ఘాతుకం

చండీగఢ్ / జైపూర్ : రాజస్థాన్‌లో బజరంగ్‌దళ్ నేతృత్వంలోని గోగూండాలు రెచ్చిపోయారు. గోవులను అక్రమంగా రవాణా చేస్తున్నారని ఆరోపిస్తూ రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు ముస్లిం యువకులను కారులో కిడ్నాప్ చేసి, హర్యానాలోని భివానీ జిల్లా లోహారు వద్ద సజీవం దహనం చేశారు. మృతుల కుటుంబ సభ్యుల కథనం ప్రకారం రాజస్థాన్‌లోని భరత్‌పూర్ జిల్లా పహరి తాలుకా ఘాట్‌మీక గ్రామానికి చెందిన నసీర్ (25), జునైద్ అలియాస్ జునా (35)లను బుధవారం గోగూండాలు కిడ్నాప్ చేశారు. లోహారు వద్ద కాలిపోయిన బొలేరో వాహనంలో వీరి మృతదేహాలను గురువారం గుర్తించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్), ఇతర బృందాలు వాహనాన్ని, మృతదేహాలను తనిఖీ చేశాయి. కిడ్నాప్ చేసిన ఇద్దరు యువకుల్ని భరత్‌పూర్‌కు సుమారు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న లోహారు కారులో తీసుకొొచ్చి అక్కడ సజీవ దహనం చేసినట్లు అనుమానిస్తున్నట్లు పోలీసులు చెప్పారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఐదుగురిపై గోపాల్‌గఢ్ పోలీస్ స్టేషన్‌ల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు భరత్‌పూర్ పోలీస్ సూపరింటెండెంట్ శ్యామ్ సింగ్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. నిందితుల్లో ఒకరిని అదుపులోకి తీసుకున్నామని, మిగతా వారి కోసం గాలిస్తున్నామని చెప్పారు. రాజస్థాన్ గోపాల్‌గఢ్ పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేశారని హర్యానా పోలీసులు పేర్కొన్నారు. వీరి హత్యలతో ఘటమీకలో ఉద్రిక్తత నెలకొంది. సుమారు రెండు వేల మంది సమావేశమవడానికి ప్రయత్నించారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, సమావేశం కాకుండా చూశారు. ఈ ఘటనను సిపిఎం ఖండించింది. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.



రెండేసి కిలోల రాగులు, జొన్నలు
- పైలెట్ ప్రాజెక్టుగా రాయలసీమలో 4 జిల్లాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డు దారులకు రెండేసి కిలోల చొప్పున రాగులు, జొన్నలు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కార్డుదారునికి పంపిణీ చేయాల్సిన బియ్యం నుంచి రెండు కిలోలు తగ్గించి ఈ మిల్లెట్స్‌ను ఉచితంగా పంపిణీ చేయనుంది. ఈ మేరకు ప్రభుత్వం జిఓ 5ను శుక్రవారం విడుదల చేసింది. పైలెట్ ప్రాజెక్టు సక్సెస్ అయిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా రాగులు, జొన్నల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. రాగులు, జొన్న పంట సాగును విస్తరించేందుకు రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖకు ఉత్తర్వులిచ్చింది. అలాగే రాగులు క్వింటాలు ధర రూ.3,578, జొన్నలు క్వింటాలు రూ.2,970 (హైబ్రీడ్), మలదండి రకం జొన్నలు క్వింటాలుకు రూ.2,990 మద్దతు ధరగా ప్రభుత్వం ప్రకటించింది.

ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్స్‌కు
చెత్త పన్ను మెలిక
- ఆన్‌లైన్ అసెస్మెంట్ తో చెల్లింపులు తప్పనిసరి
- బలవంతంగా వసూలు



రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పట్టణాల్లో అమలు చేస్తోన్న చెత్తపన్ను నుంచి ఇక ఎవరూ తప్పించుకోలేరు. ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్స్‌కు సైతం ఈ పన్నును మెలిక పెట్టారు. అంతేకాకుండా ఆస్తి పన్ను చెల్లించే అసెస్‌మెంట్లతోనే చెత్తపన్ను వసూలయ్యేలా అధికారులు ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టారు. పట్టణాల్లో అత్యధిక మంది నిరుద్యోగ యువత చిన్నచిన్న వ్యాపారాల ద్వారా ఉపాధి పొందుతున్నారు. వారిపై చెత్త పన్ను పిడుగులా మారింది. వ్యాపారాలు నిర్వహించుకోవాలంటే కార్పొరేషన్ నుంచి ట్రేడ్ లైసెన్సు తీసుకోవాల్సి ఉంది. ఏడాదికోమారు వీటిని రెన్యువల్స్ చేయించుకోవాలి. సాధారణంగా మార్చి నెలాఖరు నాటికి వ్యాపారులు రెన్యువల్స్ చేసుకోవాల్సి ఉంది. తూర్పుగోదావరి జిల్లాలో కొవ్వూరు, నిడదవోలు పట్టణాలతోపాటు రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో సుమారు 60 వేల మంది వరకూ వ్యాపారులు రెన్యువల్స్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకుంటున్నారు. చెత్తపన్ను చెల్లించిన వారు మాత్రమే ఈ రెన్యువల్స్ చేసుకొనేలా ఆన్‌లైన్ పేమెంట్‌లో ఆప్షన్‌ను తీసుకొొచ్చారు. గడిచిన ఏడాదిలో బకాయిలు మొత్తం కలిపి ఒకేసారి చెత్త పన్ను చెల్లించేలా ప్రతి వార్డు సచివాలయంలో క్లస్టర్ వారీగా ఇప్పటికే అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటి ఆధారంగా ముందుగా క్లస్టర్‌ను కంప్యూటర్‌లో ఓపెన్ చేస్తే కమర్షియల్, రెసిడెన్సియల్ అనే ఆప్షన్ వస్తుంది. అందులో అవసరమైన దానిని మిగతా 2 లో

కాఫీ బకాయిలు చెల్లించాల్సిందే
- పాడేరు ఐటిడిఎని ముట్టడించిన గిరిజనులు
- సమస్య పరిష్కారానికి కలెక్టర్ హామీ


ఐటిడిఎను ముట్టడించిన గిరిజనులు

ప్రజాశక్తి- పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

కొద్ది రోజులుగా కాఫీ సాగు ప్రోత్సాహక బకాయిల సమస్యపై పోరాడుతున్న గిరిజన రైతులు శుక్రవారం మూకుమ్మడిగా పాడేరు ఏజెన్సీ నలుమూలల నుంచి కదిలి వచ్చి ఐటిడిఎను ముట్టడించారు. తొలుత ఎపి గిరిజన సంఘం కార్యాలయం నుంచి వారంతా ర్యాలీగా తరలివచ్చారు. రెండు గంటలసేపు ఐటిడిఎ ముందు బైఠాయించారు. బకాయిలను వెంటనే చెల్లించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఏజెన్సీలో కాఫీ ప్రాజెక్టును కొనసాగించాలని, కాఫీ రైతులకు ఇచ్చే సిల్వర్ ఓక్, కాఫీ మొక్కలతోపాటు పండ్ల మొక్కలనూ పంపిణీ చేయాలని, కోల్డ్ స్టోరేజీలు, నిచ్చెనలు, రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వారి ఆందోళనకు ఎపి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మద్దతు తెలుపుతూ మాట్లాడారు. కాఫీ ప్రోత్సాహక బకాయిలను పోరాడి సాధించుకుంటామన్నారు. ఎపి కాఫీ రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాలికి లక్కు మాట్లాడుతూ రెండున్నర లక్షల ఎకరాల్లో లక్షన్నర మంది గిరిజనులు కాఫీ సాగు చేస్తోన్నా వారికి ప్రభుత్వ సహకారం అందడం లేదని విమర్శించారు.

కాఫీ రైతులకు రూ.60 కోట్లు బకాయిలను ఇప్పటి వరకూ చెల్లించకపోవడం శోచనీయమన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి సభ్యులు డి.గంగరాజు మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే ప్రణాళికలను ఐటిడిఎ రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో కాఫీ రైతుల సంఘం నాయకులు, సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చినబాబు తదితరులు పాల్గొన్నారు. రైతుల ఆందోళనకు స్పందించిన జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ వారి వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో కాఫీ రైతులకు తోడ్పాటు అందించేందుకు బ్యాంకర్ల ద్వారా రూ.25 కోట్ల రుణాల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సాంకేతికపరంగా కొన్ని స్కీముల నుంచి నిధులు రానందున కాఫీ రైతులకు ప్రోత్సాహక బకాయిలు చెల్లించలేకపోయామన్నారు. త్వరలో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

తెలుగు గంగకు జాతీయ అవార్డు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నీరు, విద్యుత్, పునరుత్పాదక ఇంధన రంగాల్లో ఉత్తమ నిర్వహణకు గానూ ప్రతిఏటా జాతీయ స్థాయిలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సిబిఐపి) అవార్డు-2022కు గానూ రాష్ట్రంలోని తెలుగు గంగ ప్రాజెక్టు ఎంపికైంది. జాతీయ స్థాయిలో 1927 నుంచి ఇస్తున్న ఈ అవార్డులను ఢిల్లీలో ఈ ఏడాది మార్చి 3న అందజేయనున్నట్లు సిబిఐపి ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు తెలుగు గంగ సిఇకి సిబిఐపి లేఖ రాసింది.

ఎపి విద్యా వ్యవస్థ ఆచరణీయం

- విద్యాశాఖ కమిషనరుతో నైజీరియా ప్రతినిధులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ విద్యా వ్యవస్థ అమలు తీరు తెన్నులు బాగున్నాయని, ఆచరణీయమని పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్‌కుమార్‌తో నైజీరియా దేశ ప్రతినిధులు అన్నారు. నైజీరియా కడువా రాష్ట్రానికి చెందిన ప్రభుత్వ ప్రతినిధి బృందం ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల్లోని వివిధ పాఠశాలలను రెండురోజులపాటు సందర్శించింది. పర్యటన ముగింపు సందర్భంగా కమిషనరును శుక్రవారం సమగ్రశిక్షా కార్యాలయంలో కలిశారు. విద్యా వ్యవస్థ నాణ్యతను మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాల గురించి, విద్యా కార్యక్రమాల గురించి వారికి కమిషనరు వివరించారు. ఈ కార్యక్రమంలో కడువా రాష్ట్ర యూనివర్శిల్ బేసిక్ ఎడ్యుకేషన్ బోర్డు హ్యూమన్ రిసోర్సెస్ శాశ్వత సభ్యులు క్రిస్టీ అయిఅలాడెమెరిన్, సీమ్యాట్ డైరెక్టర్ వివన్ మస్తానయ్య, సమగ్ర శిక్షా అభియాన్ ఎఎస్‌పిడి కెవి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'బిఇడి' వెబ్ ఆప్షన్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిఇడి కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఎడ్‌సెట్ వెబ్‌ఆప్షన్లు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఎడ్‌సెట్ కన్వీనరు, ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ కె రామ్మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లను అభ్యర్థులు ఎంపిక చేసుకోవచ్చునని తెలిపారు. ఆప్షన్లను 24వ తేదీన మార్చుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. సీట్ల కేటాయింపు ఈ నెల 27వ తేదీన ఉంటుందని, తరగతులు 28 నుంచి ప్రారంభమవుతాయని వెల్లడించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

మాజీ మేయర్ దంపతుల హత్య కేసు విచారణ ప్రారంభం

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

చిత్తూరు నగర మాజీ మేయర్ కఠారి అనురాధ, కఠారి మోహన్ దంపతుల హత్య కేసు విచారణ శుక్రవారం నుండి ప్రారంభమైంది. సాక్షుల విచారణ నేపథ్యంలో జిల్లా కోర్టు వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. చిత్తూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో 2015 నవంబర్ 17న కఠారి దంపతుల హత్య కేసు అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది. ఈ కేసులో 22 మందిని నిందితులుగా గుర్తించి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఎ వన్ ముద్దాయిగా ఉన్న చింటూ అలియాస్ చంద్రశేఖర్ నాటకీయ పరిణామాల మధ్య కోర్టులో లొంగిపోయిన విషయం విదితమే. ఈ కేసులో 21 నిందితులకు కోర్టు బెయిల్ మంజూరు చేయగా, చింటూ చిత్తూరు జిల్లా కోర్టులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ కేసు శుక్రవారం విచారణకు వచ్చిన నేపథ్యంలో చింటూతో సహా 22 మంది ముద్దాయిలను, సాక్ష్యులను ఆరవ అదనపు జడ్జి శాంతి ఎదుట పోలీసులు హాజరుపరచారు. ప్రధాన సాక్షి సతీష్‌ను న్యాయమూర్తి విచారించారు. కేసు విచారణ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనటూ చోటు చేసుకోకుండా పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు.

కుటుంబ సారథులను ప్రజలు నమ్మరు

- మంత్రి జోగి రమేష్


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు అందించేందుకు వాలంటీరు వ్యవస్థను తీసుకొస్తే విమర్శలు చేసిన చంద్రబాబు నాయుడు ఇప్పుడు 30 ఇళ్లకు ఒకరు అని గృహ సారథులను ఎలా పెట్టుకుంటారని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ ప్రశ్నించారు. గృహ సారథులు వస్తే తరిమికొట్టడం ఖాయమని అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. శివరాత్రి నాడు యాత్రికులు రాకుండా కాళహస్తిలో పాదయాత్ర పెట్టుకోవడం తగదని అన్నారు. జగన్ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో తమకు రాజకీయ మనుగడ ఉండదని తండ్రీకొడుకులు అబద్ధాలు చెప్తున్నారని చంద్రబాబు, లోకేష్‌ను ఉద్దేశించి మాజీ మంత్రి కురసాల కన్నబాబు విమర్శించారు.

అదానీకి వంత

- ముడి బొగ్గు సరఫరా కాంట్రాక్టు పొడిగింపు
- కాంట్రాక్టు విలువ రూ.600 కోట్లు పైనే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి



వివాదాల్లో కూరుకుపోతున్న అదానీ సంస్థకు మరో మేలు కల్పించేందుకు రాష్ట్ర ఇంధనశాఖ చర్యలు చేపట్టింది. రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టుకు కృష్ణపట్నం ఓడరేవు ద్వారా ముడి బొగ్గును సరఫరా చేసే కాంట్రాక్టును మరో రెండేళ్లు పొడిగించేందుకు నిర్ణయించింది. ఈ మేరకు జెన్‌కో సమావేశంలో చర్చించిన అనంతరం కీలక నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలిసింది. దీనివల్ల అదానీ సంస్థకు రూ.600 కోట్ల వరకు మేలు కలుగుతుందని అంచనా వేస్తున్నారు.

ప్రస్తుతం మహానంది బొగ్గు గనుల నుంచి రైలు-సముద్రం-రైలు మార్గం ద్వారా 40 లక్షల మెట్రిక్ టన్నుల ముడి బొగ్గును ఆర్‌టిపిపికి అందించేందుకు అదానీ సంస్థతో గతేడాది ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం 2022 మార్చి 11 నుంచి రెండేళ్లపాటు అమలులో ఉంటుంది. రెండేళ్లు లేదా నిర్దిష్ట పరిమితిని రవాణా చేసేంత వరకు అంటూ ఒప్పందంలో పొందుపరిచారు. ఈ మొత్తంలో ఇప్పటివరకు 32.52 లక్షల మెట్రిక్ టన్నులను సేకరించిన అదానీ సంస్థ ఆర్‌టిపిపికి 29.72 లక్షల మెట్రిక్ టన్నులను తరలించింది. ఇంకా 7.48 లక్షల మెట్రిక్ టన్నులను మాత్రమే సమీకరించాల్సి ఉంటుంది. ఇదికూడా ఈ మార్చిలోగా పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ రవాణా వేగంగానే ఉందని అధికారులు పేర్కొంటున్నారు. సంతృప్తికరంగా ఉందని కితాబు ఇవ్వడం కూడా విశేషం. ఇదే 40 లక్షల మెట్రిక్ టన్నులను మరో దఫాలో రవాణా చేసేందుకు తమ కాంట్రాక్టును పొడిగించాలని అదానీ సంస్థ ఇంధనశాఖకు ప్రతిపాదనలు పంపించింది. ప్రతిపాదనలు అందడం ఆలస్యం అన్నట్లుగా ఈ ప్రతిపాదనలను ఇంధన శాఖ అంగీకరించి నట్లు తెలిసింది. దీంతో మరో రెండేళ్ల వరకు బొగ్గు రవాణా అదానీ చేతుల్లో ఉంటుందని అంటున్నారు. ప్రస్తుత ధరల మేరకు ఈ బొగ్గు రవాణా వ్యయం ఒక్కో మెట్రిక్ టన్నుకు రూ.1,374 ఉండగా, మొత్తం 40 లక్షల మెట్రిక్ టన్నులకు రూ.545 కోట్లుగా అంచనా వేస్తున్నారు. దీనికి జిఎస్‌టి కలిపితే మెట్రిక్ టన్నుకు వ్యయం రూ.1525కు చేరుకుంటుంది. మొత్తం వ్యయం దాదాపు రూ.610 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

రవాణా నష్టం భారీగానే

ఎంసిఎల్ నుంచి పరదీప్‌కు రైలు మార్గం ద్వారా అక్కడి నుంచి కృష్ణపట్నం పోర్టుకు సముద్ర మార్గం ద్వారా, తిరిగి కృష్ణపట్నం నుంచి ఆర్‌టిపిపికి రైలు మార్గం ద్వారా బొగ్గును తరలించే ప్రక్రియలో రవాణా నష్టం (ట్రాన్సిట్ లాస్) కూడా భారీగానే కనిపిస్తోంది. మొత్తం ఇప్పటి వరకు జరిగిన రవాణాలో 16,460 మెట్రిక్ టన్నుల వరకు లాస్‌గా చూపిస్తున్నారు. ఇది మొత్తం రవాణాలో 0.55 శాతంగానే ఉన్నప్పటికీ, విలువ మాత్రం రూ.3 కోట్ల వరకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దీనిని ఇంధనశాఖే భరించాల్సి ఉంటుందని తెలుస్తోంది.

దర్గా పీఠాధిపతి తొలగింపు

- ఆస్తులపై శ్వేతపత్రం విడుదలకు ఆవాజ్ డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు జిల్లా ఎఎస్‌పేట మండలంలోని రెహ్మాతాబాద్ దర్గా పీఠాధిపతి పదవి నుంచి హాఫీస్ పాషాను తొలగించినట్లు వక్ఫ్ బోర్డు రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామమని ఆవాజ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ రఫీ, షేక్ రషీద్‌లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 2017 నుంచి పూర్తిస్థాయిలో దర్గా జమా, ఖర్చులు, ఆస్తులపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో రెహ్మాతాబాద్ దర్గా విశిష్టతను కాపాడే విధంగా వక్ఫ్‌బోర్డు చర్యలు చేపట్టాలన్నారు. అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. దర్గా ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దర్గాకు వచ్చే సందర్శకులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని కోరారు. మోసపూరిత మాటలు చెప్పి ఓ యువతిని వివాహం చేసుకునేందుకు హాఫీస్ పాషా యత్నించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో హాఫీస్ పాషాను విధుల నుంచి తొలగిస్తున్నట్లు వక్ఫ్ బోర్డు గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఇక నుంచి దర్గా నిర్వహణ బాధ్యతను వక్ఫ్ బోర్డు పాలక మండలి నిర్వహిస్తుందని పేర్కొంది.

ఎపి జెన్‌కో పోరాటానికి తాత్కాలిక విరామం

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు జిల్లా నేలటూరులోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎపి జెన్‌కో) వద్ద 396 రోజులుగా చేస్తున్న ఆందోళనను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర జెఎసి, ఎపి జెన్‌కో జెఎసి, పరిరక్షణ కమిటీ నాయకులు తెలిపారు. టెండర్ల ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు జెన్‌కో మేనేజ్‌మెంట్ స్పష్టమైన హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జెన్‌కో వద్ద పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఎం.మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన 396 రోజుల పోరాట సభలో పవర్ జెఎసి రాష్ట్ర జనరల్ సెక్రటరీ ప్రతాపరెడ్డి, ఛైర్మన్ ప్రతాప్, కో ఛైర్మన్ శేషారెడ్డి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు డి.సూరిబాబు, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి శివయ్య మాట్లాడారు. జెన్‌కోను ప్రయివేటీకరించబోమని మేనేజ్‌మెంట్ ఇచ్చిన హామీ మేరకు తాత్కాలికంగా ఉద్యమాన్ని విరమిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎపి జెన్‌కో ప్రయివేటీకరణ నిర్ణయాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ప్రయివేటీకరణకు పూనుకుంటే ఎపి జెన్‌కో నుండి మహా పాదయాత్ర నిర్వహిస్తామని, ఉద్యమాన్ని వివిధ రూపాలలో కొనసాగిస్తామని తెలిపారు. సభలో ఇంజినీర్ల అసోసియేషన్ నాయకులు గుమ్మడి శ్రీనివాసులు, సిఐటియు, ఎఐటియుసి, ఎఐఎఫ్‌టియు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, సిఐటియు ఇండస్ట్రియల్ కారిడార్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఐసి పోటీల్లో ఎస్‌సి గురుకుల విద్యార్థుల ప్రతిభ : మేరుగ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బెంగళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి నేషనల్ స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ (ఎన్‌ఎస్‌ఐసి) పోటీల్లో ఎస్‌సి గురుకుల విద్యార్థులు ప్రతిభ చూపారని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. ప్రకాశం జిల్లా పెదపావని ఎస్‌సి గురుకులానికి చెందిన విద్యార్థులు సత్తాచాటి ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 'సారంలేని మట్టితో హరిత విప్లవం' అనే అంశంపై విద్యార్థులు రూపొందించిన ప్రెజెంటేషన్‌కు జాతీయ స్థాయిలో ఉత్తమమైనదిగా రూ.60 వేల నగదు పురస్కారాన్ని నిర్వాహకులు అందించారని తెలిపారు. విద్యార్థుల ప్రతిభ గర్వకారణమని అన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఎ సుష్మ, డి మహిత, వారికి స్ఫూర్తినిచ్చిన ఉపాధ్యాయులు ఎ దుర్గాభవాని, గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్ పావనమూర్తి తదితరులను మంత్రి అభినందించారు.

'టీమ్ జార్జి' కలకలం

- 33 దేశాల్లో ఎన్నికల ప్రభావితం
- ఆ జాబితాలో భారత్ కూడా ?
- బిజెపిపై అనుమానాలు

న్యూఢిల్లీ : తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం ద్వారా ఎన్నికలను ప్రభావితం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఒక సంస్థ వ్యవహారం బట్టబయలైంది. ప్రతిపక్ష నేతలను, రచయితలను, మేధావులను టార్గెట్ చేయడానికి ఇజ్రాయిల్‌కు చెందిన పెగాసస్ స్పైవేర్‌ను వినియోగిస్తున్నట్లు తెలిసిందే. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాన్ని గుమ్మరించడం ద్వారా ప్రజాభిప్రాయాన్ని తమకు క్లయింట్లుగా ఉన్న పార్టీలకు అనుకూలంగా మలిచే ఈ సంస్థ కూడా ఇజ్రాయిల్‌కు చెందినదే కావడం గమనార్హం. పెగాసస్ తరహాలోనే మన దేశంలోనూ బిజెపి ఆ సంస్థ సేవలను వినియోగించుకుంటోందన్న ఆరోపణలు వస్తున్నాయి. దీనికి సంబంధించి వాస్తవాలు వెల్లడించాలని కాంగ్రెస్ పార్టీ తాజాగా డిమాండ్ చేసింది. వివిధ దేశాలకు చెందిన 30 మీడియా సంస్థల జర్నలిస్టులు కన్సార్టియంగా ఏర్పడి దాదాపు రెండు సంవత్సరాలుగా చేసిన పరిశోధనలో ఇజ్రాయిల్‌కు చెందిన 'టీమ్ జార్జి' అనే కాంట్రాక్టు సంస్థ గత రెండు దశాబ్దాలుగా ఇదే పనిలో ఉన్నట్లు తేలింది. 'ఫర్‌బిడెన్ స్టోరీస్' అనే ఫ్రాన్స్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరిశోధనలో అనేక దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. పెగాసస్ వ్యవహారాన్ని కూడా ఈ సంస్థే వెలుగులోకి తీసుకురావడం గమనార్హం. ఇంగ్లండ్‌కు చెందిన 'ది గార్డియన్' పత్రిక ప్రచురిస్తున్న తాజా పరిశోధన వివరాల ప్రకారం 33 దేశాల్లో ఈ సంస్థ ఇప్పటికే ఎన్నికలను ప్రభావితం చేసింది. వీటిలో 27 చోట్ల విజయాలు సాధించింది. ఈ విషయాన్ని ఆ సంస్థ అధినేత తాల్‌హసన్ స్వయంగా అండర్‌కవర్‌లో ఉన్న విలేకరులకు ఈ విషయం



తెలిపారు. తమను తాము క్లయింట్లుగా పరిచయం చేసుకుని ఇజ్రాయిల్ రాజధాని టెల్ అవివ్‌కు సమీపంలో ఉన్న ఆయన కార్యాలయంలో కలిశారు. 'సోషల్ మీడియా అక్కౌంట్లను నియంత్రిస్తాం. సరికొత్త కథనాలను సృష్టిస్తాం. విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుపోతాం. మా జట్టులో వివిధ దేశాల్లోని ప్రభుత్వ ఏజెన్సీల్లో పనిచేసేవారు కూడా ఉన్నారు. ఆర్థిక, సామాజిక మాధ్యమాలతో పాటు, మానసిక యుద్ధాలు చేయడంలో కూడా వారు నిష్ణాతులు' అని ఆయన చెప్పినట్లు గార్డియన్ ప్రచురించింది. హ్యాకింగ్ చేయడానికి వీలయ్యే సాఫ్ట్‌వేర్ సర్వీసులను, ఫేక్ సోషల్ మీడియా ప్రొఫైల్స్‌తో పాటు పెద్దసంఖ్యలో వెబ్‌సైట్లను సృష్టించే బ్లాగర్ మిషన్‌లను ఈ సంస్థ క్లయింట్లకు విక్రయిస్తుంది. క్లయింట్లు ఇచ్చే మొత్తాలను బట్టి ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకుంటోంది.

బిజెపిపై అనుమానాలెందుకు...?

2014 ఎన్నికల్లో సోషల్ మీడియాలో పెద్దఎత్తున సాగిన ఈ అసత్య ప్రచారమే బిజెపి గెలుపునకు దోహదం చేసిందన్న విషయం బహిరంగ రహస్యమే. మోడీ నాయకత్వంలో గుజరాత్‌లో పెద్దఎత్తున అభివృద్ధి జరిగిందటూ సోషల్‌మీడియాలో అప్పట్లో మారుమ్రోగించారు. అసత్య ఫోటోలు, వీడియోలతో ఫేస్‌బుక్,ట్విటర్ వంటి సామాజిక మాధ్యమాలను నింపివేశారు. 2002 నుండే ఈ రంగంలో తామున్నామంటూ టీమ్‌జార్జి అధినేత చెప్పిన నేపథ్యంలో బిజెపి ఆ సంస్థ సేవలు వినియోగించుకుని ఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అప్పటి నుండి ఇప్పటి వరకు ప్రత్యర్థుల మీద దాడికి, అసత్యాల ప్రచారానికి, సోషల్‌మీడియాను ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థలు పెద్ద ఎత్తున వినియోగించుకుంటున్న సంగతి తెలిసిందే.

2015లోనే నైజీరియాలో...!

2015వ సంవత్సరంలోనే నైజీరియాలో జరిగిన ఈ ఎన్నికల్లో టీమ్‌జార్జి సంస్థ జోక్యం చేసుకున్నట్లు గార్డియన్ ప్రచురించింది. బ్రిటన్‌కు చెందిన కేంబ్రిడ్జి ఎనలిటికాతో పాటు ఆ దేశాధ్యక్ష పదవికి పోటీ చేసిన జోనాథన్ తరపున టీమ్‌జార్జి కూడా పనిచేసింది. అంతర్జాతీయంగా జోనాథన్‌కు అనుకూల వాతావరణాన్ని సృష్టించే పనిని కేంబ్రిడ్జి ఎనలిటికాకు అప్పగించగా, దేశంలో ప్రతిపక్షాన్ని నైతికంగా బలహీన పరిచే వ్యూహాన్ని రూపొందించడం, విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుపోవడం, దానిని నమ్మేలా ప్రచారం చేయడం వంటి పనులను టీమ్ జార్జి చేపట్టింది. ఈ క్రమంలో ఎన్నికలను కొన్ని వారాలు వాయిదా వేసేలా చేసి, తన క్లయింట్‌కు లబ్ధి చేకూర్చడానికి ప్రయత్నించింది. కెన్యా అధ్యక్ష ఎన్నికల్లోనూ విలియం రూటోకు అనుకూలంగా సోషల్‌మీడియాలో ప్రచారం చేసింది.

చంద్రబాబు పర్యటనలో ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)



పర్యటనను అడ్డుకునేందుకు రోడ్డుపై బైటాయించిన పోలీసులు

చంద్రబాబు విమర్శించారు. విద్యుత్తు సరఫరా నిలిపివేయడం, కాన్వాయ్‌ను అడ్డుకోవడం శోచనీయమన్నారు. 'ఏమిటీ అరాచకం' అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ పాలనలో రైతులు, రైతు కూలీలు, అసంఘటితరంగ కార్మికులతోసహా ఏ రంగంలోనూ ఏ ఒక్కరూ ఆనందంగా లేరని విమర్శించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. తాను ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేస్తే వైసిపి ప్రభుత్వం నాశనం చేసిందని వివరించారు. తాము అధికారంలోకొస్తే ఆక్వా రంగానికి యూనిట్ విద్యుత్తును రూ.1.50కే ఇస్తామని హామీ ఇచ్చారు. జగన్ పాలనలో రాష్ట్రం 30 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందని విమర్శించారు.

దళితులకు అన్యాయం చేస్తున్న వైసిపి

అంతకుముందు కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా సామర్లకోట నవభారత్ వెంచర్స్ పరిశ్రమ అతిథి గృహం ఆవరణలో మాజీ మంత్రి జవహర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన దళిత సదస్సులో చంద్రబాబు మాట్లాడారు. దళితుల కోసం టిడిపి ప్రభుత్వం 27 పథకాలను అమలు చేస్తే, వైసిపి వాటిని రద్దు చేసిందన్నారు. ఈ సందర్భంగా మహాసేన రాజేష్ తన అనుచరులతో చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కెఎస్.జవహర్, గొల్లపల్లి సూర్యారావు, యనమల రామకృష్ణుడు, చిక్కాల రామచంద్రరావు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నేతలు ఖండన

తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పర్యటనను అడ్డుకోవడం దుర్మార్గమని టిడిపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా సిఎం జగన్ వ్యవహరిస్తున్నారని శుక్రవారం వేర్వేరు ప్రకటనల ద్వారా విమర్శించారు. అసంబద్ధ ఆంక్షలతో ప్రతిపక్షాలను వేధింపులకు గురి చేస్తున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఫ్యాక్షనిస్టు, ఫ్యాషిస్టు కలయికే జగన్ అని విమర్శించారు. నియంతలు కాలగర్భంలో కలిసినట్టు.. జగన్ కూడా చరిత్ర నుంచి తొలగిపోవడం ఖాయమని అన్నారు. చంద్రబాబు సభలను అడ్డుకోవడం, ప్రభుత్వ అరాచకత్వానికి, నిరంకుశత్వానికి అద్దం పడుతోందని శాసనమండలి ప్రతిపక్ష నేత, టిడిపిపొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు విమర్శించారు. 175 నియోజక వర్గాల్లో గెలుస్తామంటూ గొప్పలు చెప్పుకుంటున్న వైసిపి పెద్దలు.. టిడిపి సభలను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు.

ప్రతిపక్ష నాయకుడు పర్యటనకు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి జగన్, అండ్‌కో హడలిపోతుందని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ విమర్శించారు. కాన్వాయ్‌ను అడ్డుకోవడం కోసం పోలీసులే రోడ్డుపై బైఠాయిస్తారా? అని టిడిపి ఎమ్మెల్సీ పి అశోక్‌బాబు ప్రశ్నించారు. ఈ ఘటనపై డిజిపి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టిడిపికి వస్తున్న ప్రజాధరణ చూసి జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు.

ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్స్‌కు చెత్త పన్ను మెలిక

(మొదటిపేజీ తరువాయి)

ఓపెన్ చేస్తే అందులో అసెస్‌మెంట్ నెంబరు వస్తుంది. అనంతరం ఎడిట్ ఆప్షన్‌లోకి వెళ్లి ఈ నెంబరును నమోదు చేస్తే చెత్త పన్నుకు సంబంధించిన బకాయిల వివరాలు కనిపిస్తాయి. ఈ చెత్త పన్నును చెల్లించిన తరువాతనే రెన్యువల్‌కు మార్గం సుగమం అవుతుంది. చెత్తపన్ను బకాయిలు చెల్లించకపోతే రెన్యువల్స్ ఆగిపోతున్నాయి. దీంతో, చేసేది లేక వ్యాపారులు చెత్త పన్ను బకాయిలను చెల్లిస్తున్నారు. ఫలితంగా చెత్త పన్ను చెల్లించని ఒక్కో వ్యాపారి లైసెన్స్ రెన్యువల్స్ కోసం ఈ ఏడాది అదనంగా ఆ వ్యాపార సంస్థను అనుసరించి కనిష్టంగా రూ.1,200 నుంచి గరిష్టంగా రూ.60 వేల వరకూ చెల్లించాల్సి ఉంటుంది. ఇదే విధానం వచ్చే ఏడాది నుంచి హౌస్ హోల్డర్లకు ఆస్తి పన్ను విషయంలో అమలుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు.

చెత్త పన్ను వసూలు ఇలా

రెస్టారెంట్లు, బార్లు, హోటళ్ల నుంచి నెలకు రూ.1,000 నుంచి రూ.1,500 తోపుడు బళ్లు, ఫుట్‌పాత్‌లపై చిన్నతరహా వ్యాపారాలు చేసుకునేవారి నుంచి రూ.100 నుంచి రూ.300, లాడ్జీలకు గదుల సంఖ్యను బట్టి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు, అన్ని రకాల రిటైల్ వ్యాపారుల నుంచి సగటున రూ.150, ప్రయివేటు కమర్షియల్ కాంప్లెక్స్‌లకు రూ.500 ఉంచి రూ.800, షాపింగ్ మాల్స్‌కు రూ.2 వేల వరకు, ప్రయివేటు హాస్టళ్లకు రూ.1,500 వరకు, సినిమా థియేటర్లకు రూ.1,000 వరకు, 40 పడకలలోపు హాస్పటళ్లకు రూ.2.500, ఆపైన వాటికి రూ.5 వేలు, క్లినికల్ ల్యాబొరేటరీలు నుంచి రూ.1000 నుంచి రూ.2 వేలు, ఫంక్షన్ హాళ్లు, ఎగ్జిబిషన్ సెంటర్‌లు, కల్యాణ మండపాల నుంచి చదరపు మీటర్ల ప్రకారం రూ.2,500, రూ.3,500, రూ.5,000 కింద మూడు కేటగిరీలుగా విభజించి అధికారులు పన్నులు వసూలు చేస్తున్నారు.

'ఉక్కు' పోరాటం ఆగదు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకునేంత వరకూ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 736వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఎస్ఎంఎస్-1 విభాగానికి చెందిన కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయంపై కేంద్రంలోని మోడీ సర్కారు వెనక్కు తగ్గకుంటే ఉక్కు పోరాటం మరింత ఉధృతమవుతుందని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలూ ఒకే తాటిపైకి వచ్చి స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాడాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోన్న మోడీ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

బాలికపై అత్యాచారం

- ఐదుగురు యువకుల అరెస్ట్
- ఆలస్యంగా వెలుగులోకి

ప్రజాశక్తి-కాట్రేనికోన(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అమానుషం జరిగింది. కాట్రేనికోన మండలం చిర్రయానాంలో బాలికపై ఐదుగురు యువకులు అత్యాచారం చేశారు. పదిరోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు పోలీసులు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు..

చిర్రయానానికి చెందిన యువకులు ఈ నెల 6న గ్రామ శివారున ఖాళీ ప్రదేశంలో పార్టీ చేసుకుంటున్నారు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన బాలిక మంచినీటి కుంటకు నీళ్ల కోసం వెళ్లింది. ఆ సమయంలో అక్కడే ఉన్న యువకులు బాలికపై అత్యాచారం చేశారు. బాధిత బాలిక ఇంటికి చేరుకుని జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసింది. ఈ విషయం గ్రామ పెద్దలకు తెలియడంతో పంచాయితీ పెట్టి బాధితురాలికి రూ.లక్ష ఇచ్చి రాజీ చేసేందుకు ప్రయత్నించారు. అందుకు బాలిక కుటుంబ సభ్యులు నిరాకరించారు. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడ్డారు. ఫిర్యాదు చేయొద్దని బాధితులను గ్రామ పెద్దలు బెదిరించారు. వారిని బయటకు వెళ్లకుండా గృహ నిర్బంధం చేశారు. ఈ ఘటన వివరాలు ఈ నెల 16న సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ముమ్మిడివరం సిఐ ఎం.జానకిరామ్, కాట్రేనికోన ఎస్ఐ టి.శ్రీనివాస్ చిర్రయానాం వెళ్లి ఆరా తీశారు. బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. గ్రామ స్థాయి ప్రజాప్రతినిధి కుమారుడితోపాటు మరో నలుగురు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు గుర్తించారు. ఈ ఘటనపై అమలాపురం డిఎస్‌పి మాధవరెడ్డి విచారణ చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి ఓలేటి తేజ, ఓలేటి తులసీరావు, మల్లాడి వంశీ, ఓలేటి ధర్మరాజు, అర్థాని సత్తిబాబులను అరెస్టు చేశారు. పొస్కో యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతాప్‌రెడ్డిని సస్పెండ్ చేయాలి

- నేడు రాష్ట్ర వ్యాప్త నిరసనలు
- ఎస్‌ఎఫ్‌ఐ పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్, కడప ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ శనివారం రాష్ట్ర వ్యాప్త నిరసలకు పిలుపునిచ్చింది. ఈ మేరకు ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతాప్‌రెడ్డి విద్యాశాఖ అధికారా? వైసిపి నాయకుడా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారానికి దిగడం సిగ్గుచేటని అన్నారు. తక్షణమే ఆయనపై చర్యలు తీసుకుని సర్వీసు నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నిబంధనలను బేఖాతరు చేశారంటూ నిలదీసిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై ఎదురుదాడికి దిగి వారిపై అక్రమంగా హత్యాయత్నం కేసులు పెడతారా? అని నిలదీశారు.

మహాశివరాత్రికి 3,800 ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రంలో 3,800 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఎపిఎస్ ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు తెలిపారు. శివరాత్రికి వేసే ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ ఛార్జీలను మాత్రమే వసూలు చేస్తున్నామన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని 101 శైవక్షేత్రాలకు 25 లక్షల మంది వస్తారనే అంచనాతో ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఫేసియల్ హాజరు నుంచి మినహాయించండి

- ఎపిపిటిడి ఎన్ఎంయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసి ఉద్యోగులకు ఫేసియల్ యాప్ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎపిపిటిడి ఎన్ఎంయు అసోసియేషన్ కోరింది. ఈ మేరకు ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు ఎన్ఎంయు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పివి రమణారెడ్డి, వై శ్రీనివాసరావు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. చాలా మంది సిబ్బందికి స్మార్ట్ ఫోన్‌లు లేవని, అలాగే వాటిని వినియోగించే సాంకేతికత కూడా లేదని వివరించారు. పెండింగ్‌లో ఉన్న జీవకారుణ్య నియామకాలను తక్షణం పూర్తి చేయాలని కోరారు.



విజయవాడ అలంకార్ సెంటర్లో ధర్నా నిర్వహిస్తున్న జర్నలిస్టులు

బిబిసిపై దాడులకు నిరసనగా జర్నలిస్టుల ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ

బిబిసిపై కేంద్ర ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు నిరసనగా శుక్రవారం విజయవాడ అలంకార్ సెంటరులోని ధర్నా చౌక్‌లో జర్నలిస్టులు ధర్నా చేపట్టారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన జరిగిన ఈ ధర్నాలో జర్నలిస్టులు నల్ల రిబ్బన్లు ధరించి ప్లకార్డులు, బ్యానర్ చేతబట్టి నినాదాలు చేశారు. 'కాపాడాలి... మీడియా స్వేచ్ఛను, మానుకోవాలి.... మీడియాపై కక్షసాధింపును, నిలుపుదల చేయాలి బిబిసిపై దాడులను, కాపాడాలి భావ ప్రకటనా స్వేచ్ఛను" అని నినదిస్తూ ఆందోళన నిర్వహించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ విజయవాడ నగర అధ్యక్షులు కె సాంబశివరావు (కలిమిశ్రీ) అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ వెంకట్రావు మాట్లాడుతూ 2002లో గుజరాత్‌లో జరిగిన మత మారణహోమంపై బ్రిటీష్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ (బిబిసి) ఓ డాక్యుమెంటరీని రూపొందించి ప్రసారం చేసినందుకుగాను కేంద్ర ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పూనుకుందని విమర్శించారు. ఇప్పటికే బిబిసి డాక్యుమెంట్ లింకులను సామాజిక మాధ్యమాల్లో పెట్టడాన్ని నిషేధించిన కేంద్రం ఇప్పుడు నేరుగా ఆ వార్తా ఛానల్ కార్యాలయాలపైనే సెర్చ్/సర్వే పేరుతో దాడులకు దిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నవరపు బ్రహ్మయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం కలుగకుండా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఎపిబిజెఎ రాష్ట్ర నాయకులు వీసం శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఖరితో మీడియా స్వేచ్ఛకు ప్రమాదం ఏర్పడిందన్నారు. అనంతరం రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ టి విజయ్‌కుమార్ రెడ్డికి నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్ఎజె) కార్యదర్శి ఓ శాంతిశ్రీ, సీనియర్ జర్నలిస్ట్ కె గడ్డెన్న, ఎపిబిజెఎ రాష్ట్ర నాయకులు హలీమ్, జివి రంగారెడ్డి, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర నాయకులు షేక్ ఖాజావలి, గోరంపట్లప్ప, విజయవాడ నగర కార్యదర్శి ఎంబి నాథన్, నగర నాయకులు వి హరినారాయణరాజు, బాషా, పశ్చిమ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు ఎన్ నరేంద్రకుమార్, వియు ఫణికుమార్, నాయకులు కె శ్రీనివాస్‌తోపాటు వివిధ పత్రికలు, ఛానళ్లకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలోనూ, పలుచోట్ల మండల కేంద్రాల్లోనూ జర్నలిస్టులు ధర్నా చేశారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు.

శివరాత్రికి శ్రీశైలం సిద్ధం

- క్షేత్రానికి పోటెత్తిన యాత్రికులు
- సమస్యల స్వాగతం



ప్రజాశక్తి – కర్నూలు ప్రతినిధి

మహా శివరాత్రికి శ్రీశైలం సిద్ధమైంది. సందర్శకులకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి స్థాయిలో అధికారులు చేయకపోవడంతో అడుగడుగునా సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. శివరాత్రికి శ్రీశైలానికి లక్షలాది మంది తరలివస్తున్నారు. వీరిలో ఎక్కువ శాతం మంది కాలినడకన ఆత్మకూరు మండలం వెంకటాపురం నుంచి శ్రీశైలం వరకు కొండలు, గుట్టలు ఎక్కుతూ శ్రీశైల క్షేత్రానికి చేరుకుంటున్నారు. నడక దారి దాదాపు 40 కిలోమీటర్లు ఉంటుంది. ఇంత వ్యయప్రయాసలకోర్చి శ్రీగిరికి వచ్చే వారికి దేవస్థానం కనీస ఏర్పాట్లు చేయలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాలినడక వచ్చిన వారికి మార్గమధ్యంలో తాగు నీటికి కూడా ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. ఇదే అదనుగా కొందరు చెలమల్లోని మురుగు నీటిని బాటిళ్లలో నింపి అమ్మడం మొదలుపెట్టారు. సీతమ్మ బావి పరిసర ప్రాంతాల్లో బాటిల్ నీటిని రూ.30 నుంచి రూ.40 వరకు అమ్మారు. వేరే దారిలేక అధికధరకు చెల్లిస్తూ శుద్ధి చేయని ఈ నీటితోనే సందర్శకులు దాహార్తి తీర్చుకున్నారు. భీముని కొలను వద్ద అధికారులు ఏర్పాటు చేసిన పైపులైన్ నుంచి సరఫరా అవుతున్న నీరు దుర్వాసన వస్తుండడంతో తాగలేని ఇబ్బందులు పడుతున్నారు. బ్రహ్మోత్సవాల వేళ నల్లమల అటవీ ప్రాంతంలో శ్రీశైలానికి వాహనాల్లో తరలివెళ్లే వారికి పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. ప్రత్యేకించి ప్రకాశం జిల్లా పరిధిలోని కర్నూలు– గుంటూరు జాతీయ రహదారి (కెజి రోడ్డు) దెబ్బతినడంతో అటుగా వెళ్లే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దారిపొడవునా గుంతలు ఏర్పడడంతో అప్పటికప్పుడు అక్కడక్కడా రోడ్లకిరువైపులా కంకరతో కూడిన మట్టిని వేసి అధికారులు చదును చేయిస్తున్నారు. ముఖద్వారం నుంచి హఠకేశ్వరం వరకు ఉన్న దారి రాళ్లతోనిండి నడిచేందుకు వీలు లేకుండా ఉంది. నడక దారిలో ఎక్కడా దేవస్థానం చలువ పందిళ్లను వేయించలేదు. ఈ దారి ప్రారంభమయ్యే వెంకటాపురం వద్ద ఒకటి, కైలాస ముఖ ద్వారం వద్ద మరొకటి వేసి చేతులు దులుపుకున్నారు. దీంతో, కాస్త కూర్చోవడానికి కూడా వీలులేక సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు.

నేడు పాగాలంకరణ

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారికి నంది వాహనసేవ, పాగాలంకరణ, స్వామిఅమ్మవార్ల బ్రహ్మోత్సవ కల్యాణాన్ని అంగరంగవైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నాలుగు రకాల క్యూలైన్ల ద్వారా సందర్శకులను అనుమతించి దర్శనం కల్పిస్తున్నారు. 14 కంపార్ట్‌మెంట్లలో ఉచిత దర్శన సందర్శకులు వేచి ఉండే అవకాశం కల్పించారు. పాతాళగంగ మార్గంలోని శివదీక్ష శిబిరాలలో ఇరుముడి సమర్పణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మొత్తం 30 లక్షల లడ్డు ప్రసాదాలను కూడా సిద్ధం చేసి 15 కౌంటర్ల ద్వారా అందుబాటులో ఉంచారు. పాతాళగంగలో నీటిమట్టం తగ్గుతుండడంతో దీనిలోకి దిగనీయకుండా జల్లు స్నానాలకు మాత్రమే సందర్శకులు అనుమతించారు. గంగాభవాని స్నానఘట్టాలవద్ద స్నానాలు చేసేందుకు కూడా ఏర్పాట్లు చేశారు.

సాగనిస్తే పాదయాత్ర.. లేకుంటే దండయాత్ర..!

- యువగళం నారా లోకేష్

ప్రజాశక్తి–శ్రీకాళహస్తి/తొట్టంబేడు (తిరుపతి జిల్లా)

ఆంధ్రప్రదేశ్‌లో రాజారెడ్డి రాజ్యాంగం అమలవుతోంది... అడుగడుగునా యువగళం పాదయాత్రను అడ్డుకుంటున్నారని టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సజావుగా సాగనిస్తే పాదయాత్ర సాగుతుందని, లేదంటే దండయాత్రేనని హెచ్చరించారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర శుక్రవారం సత్యవేడు నియోజకవర్గం దాటి శ్రీకాళహస్తి నియోజకవర్గంలోకి అడుగుపెట్టింది. ఉదయం తొట్టంబేడు మండలం లక్ష్మీపురం నుంచి మొదలైన పాదయాత్ర మధ్యాహ్నం 12 గంటలకు రామచంద్రాపురానికి చేరింది. ఈ క్రమంలో రామచంద్రపురంలో నిర్వహించిన రైతు బహిరంగ సభనుద్దేశించి లోకేష్ మాట్లాడుతూ జగన్ పాలనలో ఉద్యోగం, ఉపాధి, సంక్షేమం అటకెక్కిందని విమర్శించారు. ఏటా జాబ్ క్యాలెండర్, మెగా డిఎస్‌సి, సిపిఎస్ రద్దు, ప్రత్యేక హోదా సంగతి సిఎం మర్చిపోయారని విమర్శించారు. కడప స్టీల్ ప్లాంట్‌కు 2019లో శంకుస్థాపనలో 20 వేల ఉద్యోగాలని, మళ్లీ 2023లో శంకుస్థాపన చేసి ఆరు వేల ఉద్యోగాలే ఇస్తామని చెప్పడం జగన్‌కే చెల్లిందన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మూడేళ్లలో రూ.రెండు వేల కోట్లు వెనకేసుకున్న 'బడా చోర్' అని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే శ్రీకాళహస్తిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. టిడిపి శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి, మాజీ మంత్రి అమర్నాథ్, చక్రాల ఉషా, గాలి చలపతి నాయుడు, విజయ్ కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేయాల్సిందే

- ఏపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

ప్రజాశక్తి – వి.ఆర్.పురం, ఎటపాక (అల్లూరి సీతారామరాజు జిల్లా)


పెద్దమట్టపల్లిలో ప్రభుత్వ కొనుగోలుకు నోచుకోని ధాన్యాన్ని పరిశీలిస్తున్న కృష్ణయ్య, షేక్ సాబ్జీ

రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్ద ఉన్న ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేసి, తక్షణమే డబ్బులు చెల్లించాలని ఏపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా వి.ఆర్.పురం, ఎటపాక మండలాల్లో శుక్రవారం వారు పర్యటించారు. తొలుత పెద్దమట్టపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 'మా ధాన్యాన్ని పూర్తిగా కొనలేదు సారు.. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు' అంటూ నేతల ఎదుట వాపోయారు. అనంతరం కృష్ణయ్య, సాబ్జీ మాట్లాడుతూ మండలంలో మూడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం సేకరణ పూర్తయిందని పది లారీల ధాన్యాన్ని వదిలేయడం దారుణమన్నారు. ఆరుగాలం పండించిన రైతుల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రైతుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మూలుగుతుంటే అధికారులు చోద్యం చూడడం తగదన్నారు. ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం చిన్నమట్టపల్లి పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థులకు అందుతున్న మెనూను, విద్యా బోధనా తీరును పరిశీలించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఎటపాక మండలంలోని నెల్లిపాక, నందిగామ గ్రామాల్లో పర్యటించి నల్లి, తామర పురుగు ఆశించి నష్టపోయిన మిరప పంటలను పరిశీలించారు. బాధిత రైతులందరికీ ఎకరాకు రూ.లక్ష చొప్పున నష్టపరిహారాన్ని ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్, జిల్లా నాయకులు మర్లపాటి నాగేశ్వరరావు, పూనెం సత్యనారాయణ, ఎంపిపి కారం లక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన గ్లోబల్ టెక్ సమ్మిట్

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

దేశాభివృద్ధిలో నేడు సాంకేతిక రంగం కీలకపాత్ర పోషిస్తోందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పల్సస్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి విశాఖలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో రెండ్రోజులపాటు నిర్వహించిన గ్లోబల్ టెక్ సమ్మిట్ శుక్రవారంతో ముగిసింది. చివరి రోజు జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిని పెంచడం, పాల నాణ్యతను మెరుగుపరచడంలో సాంకేతికత కీలక పాత్ర పోషించిందన్నారు. చేపలను పట్టడం, ప్రాసెస్, మార్కెట్ చేయడం వంటి వాటిని సాంకేతికత పరుగులు పెట్టించిందని పేర్కొన్నారు. సోనార్ టెక్నాలజీ, జిపిఎస్, శాటిలైట్ ఇమేజింగ్‌లో పురోగతి మత్స్యకారులకు ఎంతగానో దోహదపడి, చేపలను గుర్తించి పట్టుకోవడంలో సహాయపడిందన్నారు. టెక్నాలజీ చిన్న వ్యాపారులకు కొత్త అవకాశాలను సృష్టించిపెట్టిందని తెలిపారు. గ్లోబల్ టెక్ సమ్మిట్ కో–కన్వీనర్, పల్సస్ గ్రూప్ సిఇఒ డాక్టర్ గేదెల శ్రీనుబాబు మాట్లాడుతూ టెక్నాలజీ భవిష్యత్తును రూపొందించడానికి ఒక మంచి వేదికని అన్నారు. తాజా సమ్మిట్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చెయిన్, ఫిన్‌టెక్ అంశాలను కవర్ చేశామని తెలిపారు. ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ టివి నారాయణ, ఎపి ఇన్నోవేషన్ సొసైటీ సిఇఒ టి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో దారుణం

- భార్య, కుమార్తెపై కత్తితో దాడి • కుమార్తె మృతి

ప్రజాశక్తి – ఆమదాలవలస (శ్రీకాకుళం జిల్లా)

భార్యపై అనుమానంతో కత్తితో దాడి పాల్పడ్డాడో ఉన్మాది. అడ్డు వచ్చిన కుమార్తెపైనా దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన శ్రీకాకుళం జిల్లాలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఆమదాలవలస మున్సిపాలిటీ సొట్టవానిపేట పరిధిలోని టిజి నగర్‌కు చెందిన కొలుసు రామారావు, భార్య సూర్యం (55)ను అనుమానిస్తూ నిత్యం గొడవపడుతూ ఉండేవాడు. శుక్రవారం ఉదయం మద్యం తాగి వచ్చి భార్యతో ఘర్షణ పడ్డాడు. ఈ క్రమంలో కత్తితో భార్య తలపై దాడి చేశాడు. ఇంట్లో ఉన్న కుమార్తె విజయ (35) అడ్డుకోవడానికి ప్రయత్నించగా ఆమె పైనా విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనలో విజయ అక్కడిక్కడే మృతి చెందగా, సూర్యంకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తపుమడుగులో కొన ఊపిరితో ఉన్న సూర్యంను కుటుంబ సభ్యులు ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. డిఎస్‌పి ఎం.మహేంద్ర, సిఐ కె.పైడయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

'పోలవరం'పై చర్చకు రెడీ : అంబటి

ప్రజాశక్తి – పోలవరం



పోలవరంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధుల బృందం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు ఎవరి హయాంలో ఎంతమేర జరిగాయో తాము బహిరంగ చర్చకు సిద్ధమని, దమ్ముంటే చర్చకు రావాలని చంద్రబాబుకు జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సవాల్ విసిరారు. ప్రాజెక్టు గురించి మాట్లాడే నైతిక హక్కు చంద్రబాబుకు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టులో అతి కీలకమైన దిగువ కాపర్ డ్యామ్ నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో శుక్రవారం మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్, ఏలూరు ఎంపి కోటగిరి శ్రీధర్, రాజమండ్రి ఎంపి మార్గాని భరత్, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి బృందం ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించింది. తొలుత స్పిల్‌వే, ఎగువ కాఫర్‌డ్యామ్, దిగువ కాపర్ డ్యామ్‌లను పరిశీలించారు. అనంతరం తూర్పుగోదావరి జిల్లా అంగులూరు సమీపంలో దిగువ కాపర్ డ్యామ్ వద్ద జలవనరుల శాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంబటి రాంబాబు మాట్లాడారు. పోలవరంను చంద్రబాబే సర్వనాశనం చేశారని విమర్శించారు. చంద్రబాబు హయాంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం 72 శాతం పూర్తయినట్లు చెబుతున్న మాటలన్నీ అవాస్తవాలని 48 శాతం మాత్రమే పూర్తయిందని లెక్కలతో వివరించారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌లు, స్పిల్ ఛానల్, పైలెట్ ఛానల్ పనులను పూర్తి చేశామని తెలిపారు. వరదలు వచ్చినా ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌ల నడుమ ఏ మాత్రమూ పనులు ఆగకుండా ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు.

కమీషన్లు రావని ఆర్అండ్ఆర్ ఇవ్వలేదు

ఆర్అండ్ఆర్ పరిహారం విషయంలో చంద్రబాబు రూ.193 కోట్లు ఖర్చు పెట్టారని, గడిచిన మూడున్నర సంవత్సరాల్లో వైసిపి ప్రభుత్వం రూ.1,724 కోట్లు పరిహారం నిర్వాసితులకు అందించిందని అంబటి తెలిపారు. ఆర్అండ్ఆర్‌లో కమీషన్లు రావని చంద్రబాబు ఇవ్వలేదని ఆరోపించారు. రాజమండ్రి ఎంపి మార్గాని భరత్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుకు నిధుల కేటాయింపుల్లో కేంద్రం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందన్నారు. మార్చి పది నుంచి జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో గ్రాంట్లు గురించి అడుగుతామన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి కేంద్రం రూ.33 వేల కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ చీఫ్ సి నారాయణరెడ్డి, సిఇ సుధాకర్‌బాబు, ఎస్ఇ నరసింహమూర్తి, ఆర్అండ్ఆర్ కమిషనర్ శ్రీధర్, ఇఇలు ఆదిరెడ్డి, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఉలికిపాటు : పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీల గొంతు వినిపిస్తే ప్రభుత్వం ఉలికిపాటుకు గురవుతోందని, చంద్రబాబు అనపర్తి నియోజకవర్గంలో చేస్తున్న పర్యటనను అడ్డుకున్న విధానం చూస్తే ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవుతోందని జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబును అడ్డుకునేందుకు పోలీసులు రోడ్డుపై కూర్చోబెట్టడమేంటి? అని ప్రశ్నించారు. ప్రజలు తమ నిరసనలను తెలియజేసేందుకు రోడ్డుపై బైఠాయించడం చూశామని, విధి నిర్వహణలోని పోలీసులే రోడ్డుపై కూర్చోవడం వైసిపి పాలనలోనే చూస్తున్నామని పేర్కొన్నారు.

కన్నా వస్తే ఆహ్వానిస్తాం : ఎమ్మెల్సీ డొక్కా

ప్రజాశక్తి – గుంటూరు జిల్లాప్రతినిధి

బిజెపికి రాజీనామా చేసిన మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ వైసిపిలోకి వస్తే ఆహ్వానిస్తామని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. గుంటూరులోని వైసిపి ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కన్నా టిడిపిలో చేరతారని తాను భావించడం లేదని, వైసిపిలోగానీ, జనసేనలోగానీ చేరతారని అన్నారు. మారుతున్న రాజకీయ పరిణామాల ప్రకారం ఆయన టిడిపిలో చేరబోరని జోస్యం చెప్పారు. తమపార్టీ అధిష్టానం ఆదేశిస్తే తాను కన్నాతో చర్చలు జరుపుతానని అన్నారు. వైసిపి హయాంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని తెలిపారు. ఏ ముఖ్యమంత్రికీ లేని విజన్ జగన్మోహన్‌రెడ్డికి ఉందని పారిశ్రామికవేత్త సజ్జల్ జిందాల్ వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో రాష్ట్రం ఇతర రాష్ట్రాల కంటే ముందుందని, పారిశ్రామిక ప్రగతిలోనూ ముందున్నట్లు కేంద్ర ప్రభుత్వ సంస్థలు నివేదికలు ఇస్తున్నాయని తెలిపారు.

450 మందిపై గూగుల్ వేటు

న్యూఢిల్లీ : ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ భారత్‌లో 450 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. ప్రపంచ వ్యాప్తంగా 12,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు గడిచిన జనవరిలో గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే భారత్‌లో కోతలు ప్రారంభించినట్లు సమాచారం. భారత్‌లోని వివిధ విభాగాల్లో పనిచేసే 450 మంది ఉద్యోగులను తొలగిస్తుందని రిపోర్టులు వస్తున్నాయి. గూగుల్ ఇక్కడ హైదరాబాద్, బెంగళూరు, గుర్‌గావ్‌లో ప్రధాన కార్యాలయాలను కలిగి ఉంది. గూగుల్ నుంచి తమను అర్ధంతరంగా తొలగించారని పలువురు ఉద్యోగులు లింక్డిన్‌లో పోస్ట్ చేస్తున్నారు. గూగుల్ ఇండియాలో ఇటీవల చేపట్టిన లేఆఫ్స్‌లో అధిక నైపుణ్యాలు కలిగిన టాలెంటెడ్ కొలీగ్స్ కొలువులు కోల్పోయినట్టు తెలిసిందని గూగుల్ ఇండియా ఉద్యోగి రజనీష్‌కుమార్ ఓ పోస్ట్‌లో పేర్కొన్నారు. గూగుల్ ఇండియా లేఆఫ్స్‌లో తాను బాధితుడినయ్యానని గూగుల్ ఇండియాలో అకౌంట్ మేనేజర్ కమల్ దవే పేర్కొన్నారు.

సంపాదకీయం

'ఉపాధి' ఉసురు తీస్తారా?

గ్రామీణ భారతావనిలో కాస్తంతయినా బతుకు భరోసానిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్‌జిఎ)పై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విపరీత ఆంక్షలు విధిస్తూ నిర్వీర్యానికి కుట్ర పన్నుతున్నట్లు కనిపిస్తోంది. వేతన బకాయిలు, ముఖ ఆధారిత హాజరు, చెల్లింపులకు ఆధార్‌తో ముడిపెట్టడం వంటి ఆంక్షలు రుద్దుతోంది. 'ఉపాధి'పై ఆంక్షల కత్తి వేలాడదీయడమంటే గ్రామీణ పేద ప్రజానీకంపై ప్రత్యక్ష దాడికి పూనుకోవడమే. వ్యవసాయమే ప్రధానంగా ఉన్న గ్రామీణ భారతావనిలో నాట్లు, కోతల సమయంలో మినహా ఏడాదంతా ఖాళీగానే ఉండాల్సిన పరిస్థితులు, కరువు కాటకాలున్న ప్రాంతాల్లో ఆ పనులు కూడా దక్కక ప్రజానీకం బతుకు జీవుడా అంటూ పొట్ట చేత పట్టుకొని వలసలు వెళ్లాల్సిన పరిస్థితులను కొంత మేరకైనా నిలుపుదల చేయడానికి ఉపాధి చట్టాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. గ్రామంలోని ప్రతి వయోజనుడికి ఏడాదికి కనీసం 100 రోజులు పనిని ఈ చట్టం ఒక హక్కుగా కల్పించింది. ఉపాధి చట్టం కింద పనులు చేసిన వారందరికీ వేతనాలను కేంద్రమే చెల్లించాలి. కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో ఈ ఏడాది 'ఉపాధి' పథకానికి భారీగా కోత పెట్టడంతో దాడిని తీవ్రం చేసిన బిజెపి ప్రభుత్వం ఇప్పుడు వేతనాల చెల్లింపు బాధ్యత నుంచి తప్పుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

'ఉపాధి' వేతనాలు పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే చెల్లించాలన్న నిబంధన ఉండటంతో రాష్ట్రాలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ అక్రమాలను పట్టించుకోవడం లేదన్నది మోడీ సర్కార్ చేస్తున్న వాదన. కేంద్రం 100 శాతం భరించాలన్న నిబంధనను ఎత్తివేసి దానిస్థానంలో 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్రం భరించాలన్న నిబంధనతో ఉపాధి చట్టాన్ని సవరించాల్సిన అవసరముందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ఇటీవల సెలవిచ్చారు. అప్పుడే రాష్ట్రాలు కూడా 'ఉపాధి'లో అక్రమాలు జరగకుండా జాగ్రత్త వహిస్తాయని ఆయన చెప్పుకొచ్చారు. అంతేకాదు దేశంలో ఎక్కడా పని దొరకకపోతే అప్పుడు మాత్రమే ఈ పథకం కింద ఉపాధి పొందాలట! గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ వంటి మౌలిక సదుపాయాలు అంతంతమాత్రమేనన్న సంగతి విస్మరించి 'ఉపాధి' కార్మికులకు మొబైల్ యాప్‌లో ముఖ ఆధారిత హాజరు వేయడమేంటన్న ప్రశ్నకు కూడా గిరిరాజ్ గొప్ప బదులిచ్చారు! పారదర్శకత విషయంలో తమ ప్రభుత్వం రాజీ పడబోదని చెప్పారు. మోడీ సర్కార్‌కి ప్రజాధనం దుర్వినియోగం కాకుండదన్న అంతటి చిత్తశుద్ధి నిజంగానే ఉంటే యేటా లక్షలాది కోట్ల రూపాయలు ప్రభుత్వ విత్త సంస్థలకు ఎగవేస్తున్న కార్పొరేట్లు కనిపించడం లేదా? అదానీ అక్రమాలపై ప్రపంచం మొత్తం గగ్గోలు పెడుతున్నా ఎందుకు వెనకేసుకొస్తోంది? ఎక్కడకుపోయింది పారదర్శకత? అదానీ దోచుకున్నది ప్రజాధనం కాదా? దోచిపెట్టింది.. పెడుతున్నదీ మోడీ సర్కార్ కాదా? కోట్ల దోపిడి కానరాదు కానీ చిన్నోచితకో ఉపాధి కూలీల వేతనాల్లో మాత్రం దోపిడి కనిపెట్టడం మోసకారితనమే! పైగా ఉపాధి చట్టాన్ని తీసుకొచ్చిన లక్ష్యమే వలసలు నివారించడం.. అయితే దానికి కేంద్రం వక్రభాష్యం చెబుతోంది.

'ఉపాధి' కార్మికులకు వేతనాలు చెల్లింపు కోసం ఆధార్‌తో ముడి పెట్టడం పట్ల అసలు చట్టం యొక్క లక్ష్యానికే ప్రమాదం వాటిల్లుతుందని ఈ పథకానికి సంబంధించిన కార్మిక సంఘాల ఐక్య వేదిక ఎన్ఆర్ఇజిఎ సంఘర్ష్ మోర్చా ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేసినా మోడీ సర్కార్ పట్టించుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వ అధికారిక సమాచారం ప్రకారమే అధార్ అనుసంధానిత వేతన చెల్లింపుల విధానం వల్ల 57 శాతం ఉపాధి కార్మికులు ఈ పథకానికి దూరమవుతారు. ఈ ఏడాది బడ్జెట్‌లో గతేడాది కంటే 33 శాతం తక్కువ కేటాయింపులు చేయడం కూడా 'ఉపాధి'ని నిర్వీర్యం చేయడంలో కుట్రగానే చూడాలి. ఇప్పటికే 14 రాష్ట్రాలకు రూ.6157 కోట్ల 'ఉపాధి' బకాయిలను కేంద్రం చెల్లించాల్సి వుంది. ఆంధ్రప్రదేశ్‌కే రూ.836 కోట్లు బకాయి పడింది. వేతన బకాయిలు నిలిపివేయడం, మొబైల్ యాప్ ద్వారా హాజరు, ఆధార్ చిక్కుముడులు ఇలా ఒకదానికి ఒకటి లింక్ చేసి మొత్తంగా 'ఉపాధి' పని దినాలను కుదించేసి మొత్తం చట్టానికే సమాధి కట్టాలన్నది మోడీ సర్కార్ మదిలోని కుట్ర. గ్రామాలకు రక్షగా ఉంటున్న ఉపాధిని కాపాడుకోవడం అందరి బాధ్యత.

మహనీయుల మాట



మెజారిటీ ప్రజలు నమ్మినా, నమ్మకపోయినా సత్యం ఎప్పటికీ మారదు.

- బ్రూనో, ఇటలీ తత్వవేత్త, గణిత శాస్త్రజ్ఞుడు.

అవినీతి, మోసం, అధికార పక్షం అండ - అదానీ చరిత్ర

విశ్లేషణ



నీలోత్పల్ బసు

అదానీ గ్రూపు కంపెనీల షేర్ల విలువ స్టాక్ మార్కెట్‌లో ఒక్కసారి కుప్పకూలిపోవడంతో చుక్కలు కనిపించాయి. హిండెన్‌బర్గ్ రిసెర్చి సంస్థ తన 129 పేజీల నివేదికను బైట పెట్టినప్పటినుంచీ ఇదే పరిస్థితి. అదానీ గ్రూపు సంస్థల రుణాలు ఏ మోతాదులో ఉన్నదీ, పన్నుల ఎగవేతకు ఏ విధంగా విదేశీ అడ్డదారులను తొక్కినదీ ఆ నివేదిక వెల్లడి చేసింది. భారతీయ వ్యాపార దిగ్గజం గౌతమ్ అదానీ "ప్రపంచ కార్పొరేట్ చరిత్రలోనే అతి పెద్ద కుంభకోణానికి" పాల్పడినట్టు హిండెన్‌బర్గ్ నివేదిక ప్రకటించింది. అందరికీ అందుబాటులో ఉండే సమాచారాన్ని జల్లెడ పట్టి సేకరించిన వివరాలతోబాటు బైటకు పొక్కిన కొన్ని ఇ-మెయిల్స్ ద్వారా దొరికిన సమాచారాన్ని కూడా చాలా శ్రద్ధగా అధ్యయనం చేసిన మీదట ఆ నివేదిక రూపొందింది.

స్టాక్ మార్కెట్‌లో నమోదైన ఏడు కంపెనీలను, వాటికి అనుబంధ సంస్థలుగా ఉన్న 578 కంపెనీలను అదానీ, అతని కుటుంబ సభ్యులు మాత్రమే నిర్వహిస్తున్నారని ఆ నివేదిక ఎత్తిచూపింది. హిండెన్‌బర్గ్ నివేదిక వెల్లడి కాకమునుపు ఈ కంపెనీలకు అన్నింటికీ కలిపి 20,000 కోట్ల డాలర్ల మార్కెట్ విలువ ఉండేది (రూ.16 లక్షల కోట్ల రూపాయలు). ఒకసారి ఈ నివేదిక వివరాలు అందరికీ వెల్లడి కావడంతో పల్టీలు కొట్టి ఆ విలువ సగానికి సగం ఆవిరైపోయింది. పన్నులను ఎగవేయాలనుకునేవారికి ఆశ్రయం కల్పించే విదేశాలలో తప్పుడు పద్ధతులను అనుసరించడం, స్టాక్ లావాదేవీలలో తిమ్మిని బమ్మి చేసే ఎత్తుగడలను పాటించడం వంటి పనులకు అదానీ గ్రూపు పాల్పడిందని ఆ నివేదిక ఆరోపించింది. అదానీ కంపెనీల డాక్యుమెంట్లను, అందుబాటులోకి వచ్చిన సమాచారాన్ని విశ్లేషించిన మీదట ఆ గ్రూపు కంపెనీలకు రుణభారం చాలా ఎక్కువగా ఉందని, స్టాక్ మార్కెట్‌లో నమోదైన ఏడు కంపెనీలకూ చాలా ఎక్కువ విలువ ఉన్నట్టు చూపించారని నిర్ధారించింది. డొల్ల కంపెనీలను అడ్డం పెట్టుకుని షేర్ల ధరలను ఏ విధంగా పెంచుకుంటూ పోయారో, అలా బూటకపు అధిక ధరల ప్రాతిపదికను ఉపయోగించి ఆ షేర్లను తాకట్టు పెట్టి ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థలనుండి రుణాలను ఏవిధంగా పొందారో, ఆ లావాదేవీల ప్రాతిపదికన మార్కెట్‌లో షేర్ల విలువను ఏవిధంగా పెంచుకున్నారో ఆ నివేదిక చాలా వివరంగా తెలియజెప్పింది. మారిషస్, సైప్రస్, యుఎఇ వంటి దేశాలలో ఆ డొల్ల కంపెనీల స్థావరాలున్నట్టు వెల్లడించింది.

నివేదికలో వెల్లడించిన చాలా అంశాలు అప్పటికే ఎవరైనా పొందగలిగే విధంగా అందుబాటులోనే ఉన్నాయి. వాటిని బట్టి అదానీ కంపెనీల లావాదేవీలపై ప్రభుత్వ నిఘా విభాగాలు, నియంత్రణ సంస్థలు నిజానికి విచారణ చేపట్టాలి. కాని ఆవిధంగా చేయడంలో ఆ ప్రభుత్వ సంస్థలు ఘోరంగా విఫలమయ్యాయి. దాంతో హిండెన్‌బర్గ్ నివేదిక మదుపుదారుల మీద, సాధారణ ప్రజానీకం మీద అధిక ప్రభావాన్ని కనపరచింది.

> **గుజరాత్ మారణ హోమం తర్వాత కాలంలో అదానీ ఇనుమడించిన ఉత్సాహంతో పెట్టుబడులు పెట్టడం మొదలెట్టాడు. అందరూ మోడీని దాదాపు ఒక అంటరాని వ్యక్తిగా బహిష్కరించిన ఆ కాలంలో మోడీని ఒక గొప్ప వ్యక్తిగా మళ్ళీ నిలబెట్టడానికి తోడ్పడ్డాడు. అప్పటినుంచీ వారిద్దరి మధ్య ఒక భాగస్వామ్యం ఏర్పడింది. నాటినుంచీ అది ఇద్దరికీ పరస్పరం తోడ్పడేదిగా, ఒకరినొకరు బలపరుచుకునేదిగా కొనసాగుతోంది.**



ఈ ఉదంతంలో అదానీ గ్రూపు మొదట్లో స్పందించిన తీరు పేలవంగా ఉంది. "దేశభక్తి" రాజకీయాన్ని ముందుకు తేవడం, నివేదిక వాస్తవాలను పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించడం దీనిని సూచిస్తున్నది. 'అదానీ మీద దాడి అంటే ఇండియా మీద దాడి' అన్న తీరులో జరిగిన ప్రచారం ప్రజలను ఏవిధంగానూ సంతృప్తి పరచలేకపోయింది. షేర్ల ధరల పతనం కొనసాగింది. ఆ పతనాన్ని అరికట్టడానికి జోక్యం చేసుకునే క్రమంలో ప్రకటించిన అదనపు షేర్ల అమ్మకం (ఎఫ్‌పిఒ) తేలిపోయింది. అంచనాలకు మించి ఎక్కువగా ఆ షేర్లకు సానుకూల స్పందన వచ్చిందని మొదట్లో ప్రకటించుకున్నా, ఆ తర్వాత వాటి అమ్మకాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించవలసి వచ్చింది. నైతిక విలువలకు కట్టుబడి ఆవిధంగా చేస్తున్నట్టు ప్రకటించుకున్నా అది వాస్తవం కాదు. అదానీ స్వంత ధనంతో ఆ షేర్లను అధిక ధరకు కొనడం, సహచర కార్పొరేట్ సంస్థలు తోడుగా నిలవడంకోసం కొన్ని షేర్లను కొనడం తప్ప సాధారణ మదుపుదారులు ఎటువంటి ఆసక్తినీ కనపరచలేదు. దాంతో వాటి అమ్మకాన్ని రద్దు చేసుకున్నారు. డాలర్లలో అమ్మకానికి పెట్టిన షేర్లను కూడా వెనక్కి తీసుకున్నారు. ఈ పరిణామాలన్నింటినీ పరిశీలించినప్పుడు అత్యున్నత న్యాయస్థానం పర్యవేక్షణలో ఒక ఉన్నతస్థాయి విచారణను వెంటనే చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం ఔతోంది.

అదానీ సంపద మూలాలు

ప్రైవేటు రంగంలో ఓడరేవుల నిర్వహణ రంగంలో అతి పెద్ద కంపెనీగా, విద్యుదుత్పత్తి రంగంలో అతి పెద్ద ప్రైవేటు సంస్థగా ఉన్న కార్పొరేట్ సంస్థకు గౌతమ్ అదానీ అధిపతి. ఇది గాక, బొగ్గు గనులు, ముడిచమురు, సహజ వాయువు, గ్యాస్ పంపిణీ, విద్యుత్తు రవాణా, పంపిణీ, భవన నిర్మాణాలు, మౌలికవసతుల ప్రాజెక్టులు, లాజిస్టిక్స్ (వివిధ రంగాలలో ప్రాజెక్టులు చేపట్టడానికి కావలసిన ఏర్పాట్లన్నీ సమకూర్చడం) అంతర్జాతీయ వాణిజ్యం, విద్య, రియల్ ఎస్టేట్, ఖాద్య తైలాలు, ఆహారధాన్యాలను నిలవ చేయడం, తాజాగా విమానాశ్రయాల నిర్వహణలో దాదాపు గుత్తాధిపత్యాన్ని కలిగివుండడం - ఇవన్నీ అదానీ గ్రూపు సామ్రాజ్యంలో భాగంగా ఉన్నాయి. 28 దేశాలతో 30 రకాల సరుకుల వాణిజ్యాన్ని ప్రస్తుతం ఈ సంస్థలు నిర్వహిస్తున్నాయి.

> **మోడీ త్వరలో ప్రధాని కానున్నాడన్న వాతావరణం ఏర్పడ్డాక అదానీ సంస్థల అభివృద్ధి తీరు పూర్తిగా వేరే స్థాయికి చేరుకుంది. మోడీని బిజెపి అధికారికంగా తన ప్రధాని అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత 12 నెలల కాలంలో అదానీ సంస్థల షేర్ల మార్కెట్ విలువ 65 శాతం పెరిగింది. 2001 నాటికి రూ.3,741 కోట్లుగా ఉన్న అదానీ గ్రూపు సంస్థల టర్నోవర్ 2013-14 నాటికి రూ.75, 659 కోట్లకు పెరిగింది (24 రెట్లు)**

మోడీ కేంద్రంలో మొదటిసారి అధికారంలోకి వచ్చాక సెప్టెంబర్ 2014 నాటికి అదానీ గ్రూపు స్వంత ఆస్తుల విలువ 710 కోట్ల డాలర్లు అని ఫోర్బ్స్ సంస్థ అంచనా వేసింది.

గౌతమ్ అదానీ తన కాలేజీ చదువును అర్ధాంతరంగా ముగించాడు. కొన్నాళ్ళు వజ్రాల వ్యాపారంలో ఆరితేరిన తర్వాత 1981లో అహమ్మదాబాద్‌కు మకాం మార్చాడు. తన బంధువు ఒకరు పివిసి వ్యాపారం ప్రారంభించి నిర్వహించడానికి తోడ్పాటు అందించాడు. 1988లో అదానీ స్పోర్ట్స్ పేర క్రీడా రంగంలో ఒక వ్యాపారాన్ని ప్రారంభించాడు. దాంతో గుజరాత్‌లో అందరి దృష్టినీ ఆకట్టుకున్నాడు. దాంతోబాటు వివాదాలనూ మూటగట్టుకున్నాడు. ఐతే ఆ వ్యాపారం సైజు చూస్తే ఆ వ్యక్తి భవిష్యత్తులో ప్రపంచంలోనే రెండడో అతిపెద్ద ధనవంతుడు కాగలడని ఎవరూ అనుకోరు.

గుజరాత్ లో చెలరేగిన మత మారణహోమం మోడీ రాజకీయ జీవితంలో అత్యంత క్లిష్టమైన ఘట్టం. మోడీని ముఖ్యమంత్రిగా తొలగించాలన్న డిమాండు ముందుకొచ్చింది. అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి సైతం ముఖ్యమంత్రిగా మోడీ ప్రవర్తించిన తీరును తప్పుబట్టారు. సిఐఐ మోడీ తీరును తీవ్రంగా ఆక్షేపించింది. సరిగ్గా ఆ సమయంలో అదానీ రంగంలోకి దిగాడు. గుజరాత్ పారిశ్రామికవేత్తల సంఘాన్ని నిలువునా చీల్చి పోటీ సంస్థగా 'రిసర్జెంట్ గ్రూప్ ఆఫ్ గుజరాత్' ను ఏర్పాటు చేశాడు. ఈ గ్రూపు ఆధ్వర్యంలో' వైబ్రెంట్ గుజరాత్ శిఖరాగ్ర సదస్సును ఏర్పాటు చేయడంలో అదానీ ముఖ్య పాత్ర పోషించాడు. మోడీ చుట్టూ పారిశ్రామికవేత్తలతో కూడిన ఒక బలమైన అభిమానుల బృందాన్ని సమకూర్చడంలో కృతకృత్యుడయ్యాడు. 'గుజరాత్ నమూనా అభివృద్ధి' అనే ఒక కాల్పనిక భావనను ప్రచారంలో పెట్టగలిగాడు. అదే 2014 నాటికి మోడీ విజయం సాధించడానికి ప్రధాన ప్రాతిపదికగా ఉపయోగపడింది.

గుజరాత్ మారణ హోమం తర్వాత కాలంలో అదానీ ఇనుమడించిన ఉత్సాహంతో పెట్టుబడులు పెట్టడం మొదలెట్టాడు. అందరూ మోడీని దాదాపు ఒక అంటరాని వ్యక్తిగా బహిష్కరించిన ఆ కాలంలో మోడీని ఒక గొప్ప వ్యక్తిగా మళ్ళీ నిలబెట్టడానికి తోడ్పడ్డాడు. నానుంచీ వారిద్దరి మధ్య ఒక భాగస్వామ్యం ఏర్పడింది. అప్పటినుంచీ అది ఇద్దరికీ పరస్పరం తోడ్పడేదిగా, ఒకరినొకరు బలపరుచుకునేదిగా కొనసాగుతోంది.

2002 నుండి 2014 మధ్య కాలంలో (మోడీ ప్రధాని అయ్యే వరకూ) అదానీని మోడీ పూర్తి స్థాయిలో బలపరిచాడు. ముంద్రా పోర్టు చుట్టూ 7350 హెక్టార్ల భూమిని చదరపు మీటరుకు ఒక సెంటు చొప్పున రేటు నిర్ణయించి కేటాయించాడు. (18,375 ఎకరాలు, ఎకరా కి రూ.3200 చొప్పున) ఇది తక్కిన పారిశ్రామికవేత్తలకు కేటాయించిన రేటు కన్నా కూడా చాలా తక్కువ. అదే భూమిని అదానీ ఇతరులకి చదరపు మీటర్‌కు 11 డాలర్ల రేటుకు లీజుకు ఇచ్చాడు. ఇది అదానీ ప్రభుత్వానికి చెల్లించిన రేటు కన్నా వందరెట్లు ఎక్కువ. ఇది కాక...ఎస్ఇజడ్ కోసం అదానీ గ్రూపు సేకరించిన వేలాది ఎకరాల భూమికి స్టాంపు డ్యూటీ చెల్లింపు నుండి మినహాయించాడు. ఆ గ్రూపు అన్ని పర్యావరణ నిబంధనలనూ, గిరిజన రక్షణ చట్టాలనూ అడ్డగోలుగా ఉల్లంఘించింది. గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో నడిచే గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్ అదానీకి రూ.70 కోట్లకు పైగా అక్రమ మార్గంలో లబ్ధి చేకూర్చిందని అప్పుడు కాగ్ తప్పుబట్టింది కూడా.

ముంద్రా ఉత్తర భాగం ప్రాజెక్టులో, ఎస్ఇజడ్ లో అక్రమంగా చిట్టడవుల భూములను ఆక్రమించుకున్నందుకు, పర్యావరణాన్ని, స్థానిక జీవ వైవిధ్యాన్ని నాశనం చేసినందుకు అదానీపై యుపిఎ ప్రభుత్వం రూ.200 కోట్ల అపరాధరుసుం విధించింది. కాని దానిని మోడీ నాయకత్వంలోని గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. అదానీ ప్రయోజనాలకోసం పర్యావరణ ప్రయోజనాలను బలి చేయడానికి మోడీ ఏ మాత్రమూ వెనుకాడలేదు.

ఇక మోడీ త్వరలో ప్రధాని కానున్నాడన్న వాతావరణం ఏర్పడ్డాక అదానీ సంస్థల అభివృద్ధి తీరు పూర్తిగా వేరే స్థాయికి చేరుకుంది. మోడీని బిజెపి అధికారికంగా తన ప్రధాని అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత 12 నెలల కాలంలో అదానీ సంస్థల షేర్ల మార్కెట్ విలువ 65 శాతం పెరిగింది. 2001 నాటికి రూ.3,741 కోట్లుగా ఉన్న అదానీ గ్రూపు సంస్థల టర్నోవర్ 2013-14 నాటికి రూ.75, 659 కోట్లకు పెరిగింది (24 రెట్లు).

సి.ఎం గా ఉన్న మోడీ ప్రధాని కానున్నాడన్న అంచనాకే అదానీ ఆస్తులు ఇంత భారీ స్థాయిలో పెరగడం అదానీ-మోడీ కూటమికి, వారి భజన బృందానికి అవసరమైనంత ఉత్సాహాన్ని కలిగించాయని వేరే చెప్పనవసరం లేదు.

/ముగింపు తదుపరి సంచికలో/

(స్వేచ్ఛానువాదం)

★

జనవాక్యం

పరీక్షలో నెగ్గి ... వివక్షలో ఓడి...


ముంబై ఐఐటీలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి దర్శన్ ఆత్మహత్య చేసుకున్న వార్త అత్యంత బాధాకరం. ఆ విద్యార్థి ఆత్మహత్య వెనుక కారణాలు ఇంకా తెలియనప్పటికీ దళిత విద్యార్థి అయినందున కుల వివక్ష పాత్ర కూడా ఉందేమో శోధించాలి. ఎందుకంటే ఉన్నత విద్యా సంస్థల్లో కుల వివక్ష చాప కింద నీరులా కొనసాగడం కాదనలేని నిజం. కాబట్టి ఇలాంటి ఘటనల వెనుక వేరే కారణాలు బలంగా బయటపడేంత వరకూ కుల వివక్షా హత్యలు గానే పరిగణించాలి. అలాంటి స్థితి ఇంకా కొనసాగడమే సిగ్గు చేటు. 2014 నుండి 2021 వరకూ ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల బాలవన్మరణాల సంఖ్య 122. అందులో సగానికి పైగా ఐఐటీలు, ఎన్ఐటీ ల్లోనే జరిగాయి. అందులో అధిక భాగం దళిత ఆదివాసీలే. ముంబై ఐఐటీలో ఒక్క ఆదివాసీ అధ్యాపకుడైనా లేరట. దళితులు ముగ్గురే ఉన్నారట. ఆయా సంస్థల్లో ఉద్యోగాలు పూర్తిగా భర్తీ చేస్తే రాజ్యాంగం ప్రకారం 22 శాతం మంది కొలువుంటారు. ఆయా వర్గాల విద్యార్థుల పట్ల కొంత సానుభూతి వాతావరణం ఏర్పడుతుంది. కులమతాల పట్టింపులు లేని వాతావరణాన్ని విద్యాలయాల్లో నెలకొల్పడం పెద్ద కష్టమేమీ కాదు. ఎందుకంటే ఉత్సాహవంతులైన యువకులు స్నేహానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. ఇరుకు మనస్తత్వాలు తక్కువ. పెద్దలే వారిని పక్కదోవ పట్టిస్తారు. ఆ కలుషిత మానవుల్ని కట్టడి చేసే వ్యవస్థ అవసరం. లేదంటే గర్వంగా చెప్పుకోవాల్సిన విద్యాలయాలు పేరు చెప్పడానికి సిగ్గుపడేవిలా మారతాయి.

- డా. డి.వి.జి.శంకర రావు, మాజీ ఎంపీ, పార్వతీపురం.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

పాలక పార్టీ ఏజెంట్లుగా గవర్నర్లు

కామెంట్



ఇటీవల భారత రాష్ట్రపతి చేపట్టిన ఆరుగురు కొత్త గవర్నర్ల నియామకం...గవర్నర్ పదవిని మోడీ ప్రభుత్వం ఎలా చూస్తున్నది? నిస్సిగ్గుగా దాన్ని ఎలా దుర్వినియోగం చేస్తున్నది? అనే దానికి సంబంధించి అనేక విషయాలను తెలియచేసింది.

పని లేకపోయినా ఆర్భాటానికి కొదవలేని గవర్నర్‌గిరీని రెండు మాసాల క్రితం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు కట్టబెట్టి, ఆంధ్రప్రదేశ్‌కు పంపడం దీనికి ఒక చక్కటి ఉదాహరణ. 2019లో అయోధ్య వివాదం కేసులో ఏకగ్రీవంగా తీర్పు ఇచ్చిన ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో జస్టిస్ నజీర్ కూడా ఒకరన్న విషయం మరచిపోరాదు. అందుకే, ఈ నియామకాన్ని 'క్విడ్ ప్రో కో' (నీకిది-నాకది)గా చూస్తున్నారు.

2014లో కేరళ గవర్నర్‌గా జస్టిస్ పి.సదాశివంను మోడీ ప్రభుత్వం నియమించినప్పుడే దాని కపట వైఖరి బయటపడింది. రిటైరైన భారత ప్రధాన న్యాయమూర్తి గవర్నర్‌గా అవతారమెత్తిన తొలి ఉదంతమది. ఈ చర్యను రిటైర్డ్ న్యాయమూర్తులు, న్యాయ నిపుణులు తీవ్రంగా ఆక్షేపించారు. న్యాయ స్వాతంత్ర్యానికి వాటిల్లిన ముప్పుగా వారు అభివర్ణించారు.

ఇప్పుడు నియమితులైన మరో నలుగురు కూడా ఆర్ఎస్ఎస్-బిజెపికి చెందినవారే. వారిలో ఎక్కువమంది బిజెపి కి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులే. వారికున్న అర్హత అంతా పాలక పార్టీకి, ఆర్ఎస్ఎస్‌కు విధేయంగా వుండడమే. గవర్నర్‌గా వారి విధులను ఎలా నిర్వర్తిస్తారన్నది పాలక పార్టీ పట్ల వారి ప్రభు భక్తే నిర్ణయిస్తుంది. ఈ నియమితుల్లో ఒకరు పాలక పార్టీ నేతలకు సాగిలపడి కృతజ్ఞతలు చెప్పుకోవడం ఇందుకు నిదర్శనం. తమిళనాడుకు చెందిన మాజీ బిజెపి ఎంపి సి.పి.రాధాకృష్ణన్, రాష్ట్రపతికి హృదయపూర్వక కృతజ్ఞతలు చెప్పడమే కాదు, 'మన ప్రియతమ, అత్యంత గౌరవనీయులైన ప్రధాని నరేంద్ర మోడీ, గౌరవనీయులైన హోం మంత్రి అమిత్ షా"లకు కూడా కృతజ్ఞతలు అంటూ ట్వీట్ చేశారు. జార్ఖండ్ గవర్నర్‌గా తనను నియమించినందుకు ఆయన ఈ రీతిన కృతజ్ఞతలు తెలియచేసుకున్నారు. ఇలా సాగిలపడి కృతజ్ఞతలు తెలిపారంటేనే గవర్నర్‌గా ఆయన వ్యవహార శైలి ఎలా వుండబోతుందో ఇట్టే తెలిసిపోతుంది.

> **నరేంద్ర మోడీ, అమిత్‌షా లకు సంబంధించినంత వరకు...విధేయులైన పార్టీ కార్యకర్తలు, ఆర్ఎస్ఎస్ స్వయంసేవక్‌లు, రిటైరైన, తమకు అనుకూలురైన అధికారులు, జనరల్స్ సమూహం నుండే గవర్నర్ల ఎంపిక వుంటుంది. గత కొద్ది సంవత్సరాలుగా బిజెపి యేతర పాలిత రాష్ట్రాలకు నియమించిన గవర్నర్లందరూ పాలక పార్టీ ఏజెంట్లుగా లేదా అంతకంటే అధ్వానంగా రాజకీయ అనుచరులుగా వ్యవహరించినవారే.**

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

నరేంద్ర మోడీ, అమిత్‌షా లకు సంబంధించినంత వరకు...విధేయులైన పార్టీ కార్యకర్తలు, ఆర్ఎస్ఎస్ స్వయంసేవక్‌లు, రిటైరైన, తమకు అనుకూలురైన అధికారులు, జనరల్స్ సమూహం నుండే గవర్నర్ల ఎంపిక వుంటుంది. గత కొద్ది సంవత్సరాలుగా బిజెపి యేతర పాలిత రాష్ట్రాలకు నియమించిన గవర్నర్లందరూ పాలక పార్టీ ఏజెంట్లుగా లేదా అంతకంటే అధ్వానంగా రాజకీయ అనుచరులుగా వ్యవహరించినవారే.

ఈ గవర్నర్లందరూ రాజ్యాంగ నిబంధనలను తుంగలో తొక్కి ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను నానా ఇబ్బందులకు గురిచేశారు. ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం లేదా పర్యవేక్షించడం అనే కర్తవ్యాలను తమకు తామే నిర్దేశించుకున్నారు. పంజాబ్ గవర్నర్ భన్వారీలాల్ పురోహిత్ ముఖ్యమంత్రి భగవత్ మాన్‌కు రాసిన లేఖ ఇటువంటి విపరీత వైఖరికి తాజా ఉదాహరణ. విదేశాలకు శిక్షణ కోసం పంపే స్కూళ్ళ ప్రిన్సిపాళ్ళను ఎంపిక చేసే క్రమాన్ని అలాగే రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే ఇతర నిర్ణయాలను గవర్నర్ ఆ లేఖలో ప్రశ్నించారు.

రాష్ట్ర శాసనసభనుద్దేశించి గవర్నర్ చేసే ప్రసంగంలో కొన్ని భాగాలను చదవడానికి తిరస్కరించడం దగ్గర నుండి సీనియర్ అధికారులను రప్పించుకుని వారికి హుకుంలు జారీ చేయడం, రాష్ట్రాల పాలక పార్టీల రాజకీయ వైఖరులను బహిరంగంగా విమర్శించడం, పెండింగ్‌లో వున్న బిల్లులకు ఆమోద ముద్ర వేసేందుకు తిరస్కరించడం వరకు పలు చర్యల ద్వారా బిజెపి నియమిత గవర్నర్లు అలంకారప్రాయమైన ఈ పదవిని నిరంతరంగా దుర్వినియోగం చేస్తున్నారు.

బిజెపి యేతర పాలనలోని రాష్ట్ర ప్రభుత్వాలన్నీ గవర్నర్ల రాజ్యాంగ విరుద్ధమైన చర్యలకు స్వస్తి పలకాలని ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం మాత్రం గవర్నర్ల చర్యలను సమర్థిస్తూ వారిని మరింతగా ఎగదోస్తున్నది. ఈ రాష్ట్రాలలో సమాఖ్య సూత్ర పరిరక్షణకు, గవర్నర్ల నిరంకుశ చర్యలకు చెక్ పెట్టడానికి ప్రజలను సమీకరించేందుకు ప్రచారోద్యమం చేపట్టాలి.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

★

కవిత్వం

వర్తమానం ... కర్తవ్యం..

దేశ హద్దుల్లో పెట్టుబడి విశ్వ గద్దె ఎగిరాక
చరిత్ర తన చైతన్యాన్ని జమ్మిచెట్టుపై పెట్టి
అశోక వృక్షం నీడలో నిద్రలోకి జారుకుంది
కలుగులు దాటుతున్న దేశీయ ధనపతులు
కార్పొరేట్ పందికొక్కుల అవతారమెత్తి
అదునుకు ఉన్న పదునును పసిగట్టి
రాజకీయ పందిరిని మందిరం చేసుకున్నాయి
పుల్లా పుడక కూడేసి పిచ్చుకలు కట్టిన గూళ్ళపై
గద్దలు ఏకమై పెద్దరికపు తీర్పులు చేశాయి.
ఇంకేముంది ....
నెల వేతనాల కోతలు దిన కూలీలకు గోతులు
తెల్లోడిని తరిమి సాధించిన స్వాతంత్ర్యం వెతలు
అరకొరగా పెంచిన ఉపాధి కొమ్మల నరికివేతలు
తినే తిండీ, ఉండే గూడూ, కట్టే బట్ట కరువయ్యాయి
ధరలు సగటు మనిషికందని పరుగు పోటీకి
దిగాయి
శ్రమ బతుకులు మెతుకులు వెతుక్కోసాగాయి
పోరాటాలు నేరమనే చట్టాలు పీఠాలెక్కాయి
హక్కుల గొంతుకలు నొక్కేశాయి.
ఇప్పుడేం చేయాలి ....?
చరిత్రను కదిపి లేపి జనానికి తాపితేగాని
జమ్మిచెట్టుపై చైతన్యం
జనంచేతి ఆయుధం కాదనేది నిజం
అందుకు గడ్డి పోగులకు
పోరాట పాఠాలు చెప్పాలి
పోగూ పోగూ కలిస్తేనే
యెంటి (తాడు) అవుతుందని
ఏనుగునైనా బంధించేది యెంటేననీ
ఇప్పుడు ఆ యెంట్లు పేనే
నిపుణులు కదలాలనీ
గడ్డి పోగులు ఏరి కలపాలనీ ...
సందేహం లేని సందేశం
గుండెగుండెనూ తాకేలా చేయాలి
అందుకు ఏ కులమైనా మతమైనా
ద్వేషాల దేహాలు వదిలి
చెమట చుక్కలు ఒక్కటిగా కలిపి
ఊరూ వాడా ఏకమై కదలాలి.

- ఉన్నం వెంకటేశ్వర్లు

కేంద్ర విధానాలపై ఉమ్మడి పోరు

వ్యవసాయ కార్మికసంఘం మహాసభలో విజూకృష్ణన్



జ్యోతిబసు నగర్ (హౌరా) నుండి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై సంయుక్త పోరాటానికి సిద్ధం కావాలని ఎఐకెఎస్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ పిలుపునిచ్చారు. హౌరాలో జరుగుతున్న వ్యవసాయ కార్మిక సంఘం 10వ మహాసభలో శుక్రవారం ఆయన సౌహార్ధ సందేశం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నయా ఉదారవాద ఆర్థికవిధానాల ప్రభావం వ్యవసాయరంగంపై తీవ్రంగా ఉందని, ఫలితంగా రైతులు, వ్యవసాయ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని చెప్పారు. ఎఐకెఎస్‌కు వ్యవసాయ కార్మిక సంఘానికి సారూప్యత ఉందని తెలిపారు. మోగాలో 1954లో జరిగిన ఎఐకెఎస్ మహాసభ వ్యవసాయ కార్మికుల అంశంపై ప్రత్యేక తీర్మానం చేసిందని తెలిపారు. గత నాలుగు దశాబ్దాలుగా రెండు సంఘాలు సంయుక్తంగా పోరాడుతున్నాయని వివరించారు. ప్రపంచీకరణ విధానాల ప్రమాదాన్ని తొలిసారిగా ప్రజల్లోకి తీసుకెళ్లింది వ్యవసాయ కార్మిక సంఘమే అన్నారు. ఆ విధానాల ఫలితంగాఇ రైతులకు కనీస మద్దతు ధరల దొరకడం లేదని, ఉపాధి హామీ, ఆహార భద్రత, కనీసవేతనాలు లేకుండా పోతున్నాయని వివరించారు. దేశ వ్యాప్తంగా జరిగిన రైతాంగ ఉద్యమంలో వ్యవసాయ కార్మికులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నందువల్లే కేంద్రం దిగిరావాల్సి వచ్చిందని అన్నారు. 2024లో దేశంలో మార్పు వస్తుందని, దీనిలో వ్యవసాయ కార్యికులు కీలక పాత్ర పోషించనున్నారని చెప్పడంలో ఏ మాత్రమూ సందేహం లేదని అన్నారు.



హౌరాలో వ్యవసాయ కార్మికసంఘం భారీ ర్యాలీలో నేతలు, కార్యకర్తలు

మహిళా కార్మికులకు సమగ్రచట్టం

- మహాసభలో ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి శివనాగరాణి

జ్యోతిబసునగర్ (హౌరా) నుండి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి



మహిళా వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం అందడం లేదని, వారికోసం సమగ్రచట్టం తీసుకువచ్చేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి వి.శివనాగరాణి డిమాండ్ చేశారు. ప్రతినిధుల చర్చల సమయంలో ఆమె మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలకు కనీస భద్రత కూడా ఉండటం లేదన్నారు. పనులు లేకపోవడంతో ఎక్కువమంది కార్మికులు వలసలు పోతున్నారని వివరించారు. మహిళల కోసం కనీస వేతన చట్టం చేస్తేనే న్యాయం జరుగుతుందని చెప్పారు. మహిళా వ్యవసాయ కార్మికుల కోసం ఆంధ్రప్రదేశ్‌లో కన్వీనింగ్ కమిటీ పనిచేస్తోందని పేర్కొన్నారు. నాలుగు జిల్లాల్లో ఇప్పటికే కమిటీలు వేసినట్లు తెలిపారు.

రాష్ట్రాల హక్కుల కోసం ఐక్య ఉద్యమం

- వ్యవసాయ కార్మిక మహాసభ తీర్మానం

జ్యోతిబసునగర్ (హౌరా) నుండి ప్రజాశక్తి ప్రతినిధి

రాష్ట్రాల హక్కుల పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాన్ని నిర్వహించాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు హౌరాలోని జ్యోతిబసు నగర్‌లో జరుగుతున్న పదవ మహాసభలో శుక్రవారం తీర్మానాన్ని ఆమోదించింది. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి ఆర్థిక మూలాలపై కేంద్రం క్రమపద్ధతిలో దాడిచేస్తోందని తీర్మానంలో పేర్కొన్నారు. కేంద్రం అధికారాలను తన గుప్పిట్లో పెట్టుకునేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. దీనికోసం రాష్ట్రాల ఆర్థిక మూలాలను క్రమంగా దెబ్బతీస్తున్నారని, కేంద్రం నుండి రావాల్సిన నిధులనూ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. పెఢరలిజం రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలో భాగమని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కూడా కేంద్రం పట్టించుకోవడం లేదని వివరించారు. కోవిడ్ అనంతరం రాష్ట్రాలపై దాడి మరింత తీవ్రమైందని చెప్పారు. టీకాలు వేయడం, కిట్లు అందించడం దగ్గర నుండి అన్ని విషయాల్లోనూ రాష్ట్రాల హక్కులను కాలరాశారని వివరించారు. మందుల కొరత, ఆక్సిజన్ లోపం ఉన్న సమయంలోనూ రాష్ట్రాలను ఆదుకోవడంలో కేంద్రం విఫలమైందని చెప్పారు. కార్పొరేట్ అనుకూల వ్యవసాయ చట్టాలు, లేబర్‌కోడ్లు వంటి చట్టాలు తీసుకొచ్చి మరింత ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. రాష్ట్రాల జాబితాలో ఉన్న హక్కులను తగ్గించారని, దీనకోసం గవర్నర్‌ను ఉపయోగించుకుంటున్నారని తీర్మానంలో పేర్కొన్నారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో ఆస్థిరతను సృష్టించేందుకు కేంద్ర నిఘా సంస్థలను వాడుకుంటోందని తెలిపారు. రాష్ట్రాలకు 2018-19లో రాష్ట్రాలకు చట్టబద్ధంగా ఇవ్వాల్సిన రూ.47 వేల కోట్లను ఇవ్వలేదని అన్నారు. రాష్ట్రాలకు చట్టబద్ధంగా ఇవ్వాల్సిన నిధులను ఇవ్వకపోగా పదేపదే ఉల్లంఘనలకు పాల్పడుతోందని తీర్మానంలో పేర్కొన్నారు.

'ఉపాధి' వేతనాలకు ఆధార్ ముడి

57 శాతం మంది ఉపాధికి కేంద్రం ఎసరు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉపాధి హామీపై కేంద్ర ప్రభుత్వం మరో వేటు వేసింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీకి రూ.30 వేల కోట్ల కేటాయింపుల్లో కోత పెట్టింది. ఇప్పుడు వేతనాల కోసం ఆధార్ ఆధారిత చెల్లింపులను బలవంతం చేస్తుంది. ఇది అమలు చేయడం వల్ల ప్రభుత్వ డేటా ప్రకారమే 57 శాతం మంది కార్మికులు వేతనాలకు దూరం అవుతారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం కింద వేతనాల పంపిణీకి ఆధార్-రూటెడ్ చెల్లింపు వ్యవస్థను తప్పనిసరి చేసింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ జనవరి 30న అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు లేఖ రాస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం 2023 ఫిబ్రవరి 1 నుండి అమలులోకి వస్తుందని మంత్రిత్వ శాఖ డైరెక్టర్ ధరంవీర్ ఝా లేఖలో పేర్కొన్నారు. కార్మికులు తమ ఖాతాను తమ ఆధార్ నంబర్‌తో లింక్ చేయాలని వారి బ్యాంకులను అభ్యర్థించాలి. దీని తరువాత, నౌ యువర్ కస్టమర్ వివరాలను సమర్పించిన తరువాత ఖాతాను నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. ఈ ప్రక్రియలో ఖాతాదారుని బయోమెట్రిక్ ప్రమాణీకరణ కూడా ఉంటుంది.

43 శాతం మంది కార్మికులకు మాత్రమే ఎబిపిఎస్ సౌకర్యం ఉంది. ఉపాధి హామీ అమలును నిశితంగా పరిశీలిస్తున్న జీన్ డ్రేజ్ వంటి ఆర్థికవేత్తలు, 57 శాతం మంది కార్మికులు ఆధార్-ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఎబిపిఎస్)లో భాగం కారని చెప్పారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి సంవత్సరానికి 100 రోజుల వరకు పని కల్పించే జాతీయ ఉపాధి హామీ చట్టం కింద ప్రజలను పని డిమాండ్ చేయకుండా నిరోధించడానికి మోడీ ప్రభుత్వం తీసుకున్న మరో అడుగు అని విమర్శించారు. ఇప్పుడు కార్మికులకు బ్యాంకు, పోస్టల్ ఖాతాల ద్వారా వేతనాలు చెల్లిస్తున్నారు. ఎబిపిఎస్‌ని అనుసరించడం గజిబిజిగా ఉండే ప్రక్రియ అని ఆర్థికవేత్త డ్రెజ్ అన్నారు. కొత్త వ్యవస్థను ముందుకు తీసుకురావడం వెనుక హేతుబద్ధతను ఆయన ప్రశ్నించారు. "సాధారణ బ్యాంకు ఖాతాలకు చేసిన చెల్లింపు కంటే ఎబిపిఎస్ ద్వారా చెల్లింపు మెరుగ్గా ఉంటుందని ఎటువంటి ఆధారాలు లేవు. ఇది మెజారిటీ కార్మికులకు పని లేకుండా చేసే నిర్లక్ష్య నిర్ణయమని ఆయన అన్నారు. "ఎబిపిఎస్‌తో చాలా సంక్లిష్టత ఉంది. అందుకే చాలా మంది కార్మికులు ఇంకా చేయలేదు" అని డ్రెజ్ తెలిపారు. ఆన్‌లైన్ హాజరు తప్పనిసరి అనే కొత్త విధానంతో ఉపాధి హామీ కార్మికులు ఇప్పటికే ఎదుర్కొంటున్న సమస్యలను కార్యకర్త నిఖిల్ డే ఎత్తి చూపారు. "పని ప్రదేశంలో కార్మికుడి ఫోటో తీయాలి. మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ ప్రక్రియ అస్తవ్యస్తమైన ఇంటర్నెట్ కనెక్టివిటీ కారణంగా నిలిచిపోయింది" అని అన్నారు.

ఉపాధి హామీని రద్దు చేయకుండా చంపేస్తోంది: బి.వెంకట్

ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఎన్‌ఆర్‌ఇజిఎ చట్టాన్ని అధికారికంగా రద్దు చేయకుండా చంపేస్తోందన్నారు. అందులో భాగంగా బడ్జెట్ కేటాయింపుల కోత, ఆన్‌లైన్ హాజరు తప్పనిసరి వంటి చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఇప్పుడు కార్మికులను పనికి దూరం చేసేందుకు ఆధార్ ఆధారిత చెల్లింపులను తప్పనిసరి చేసిందని పేర్కొన్నారు. ఉపాధి హామీ కోసం 2023-24 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.60,000 కోట్లు కేటాయించిందని, ఇది 2022-23లో సవరించిన కేటాయింపుల కంటే రూ.30,000 కోట్లు తక్కువగా ఉందని చెప్పారు.

మేమే నిపుణులను ఎంపిక చేస్తాం

- అదానీ వ్యవహారంలో కేంద్రానికి 'సుప్రీం' షాక్
- 'సీల్డ్ కవర్' పేర్లకు తిరస్కరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అదానీ గ్రూప్-హిండెన్‌బర్గ్ నివేదిక వివాదాన్ని పరిశీలించేందుకు ఏర్పాటు చేసే కమిటీలో కేంద్రప్రభుత్వం సీల్డ్ కవర్లో సూచించే నిపుణుల పేర్లను చేర్చేందుకు సుప్రీం కోర్టు శుక్రవారం నిరాకరించింది. న్యాయవాదులు మనోహర్ లాల్ శర్మ, విశాల్ తివారీ, కాంగ్రెస్ నేత జయా ఠాకూర్ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ జెబి పార్దివాలా నేతృత్వంలోని ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. తామే స్వయంగా నిపుణులను ఎంపిక చేస్తామని, యావత్ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తామని ధర్మాసనం తెలిపింది. నిపుణుల పేర్లను తాము ప్రభుత్వం నుంచి స్వీకరిస్తే, అది ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ అవుతుందని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. కమిటీ పట్ల ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉండాలని పేర్కొంది. హిండెన్‌బర్గ్-అదానీ వివాదంపై దర్యాప్తు జరిపేందుకు సిట్టింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిని నియమించబోమని స్పష్టం చేసింది. రిటైర్డు సుప్రీం కోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఓ కమిటీని ఏర్పాటు చేస్తామని వివరించింది. పిటిషనర్ల తరపున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. అదానీ షేర్ల ధరల తారుమారును సులభతరం చేయడానికి ఎల్‌ఐసి ఉపయోగించబడిందా? అని ఆయన ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వం అంతకుముందు వినిపించిన వాదనల్లో.. మన దేశంలోని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) వంటి చట్టబద్ధ వ్యవస్థలకు సంపూర్ణ సమర్థత ఉందని, ఇవి తమ పని తాము చేస్తున్నాయని తెలిపింది. ఇటువంటి పరిస్థితుల్లో దేశంలోని నియంత్రణ వ్యవస్థలకు ఓ పర్యవేక్షక కమిటీ ఉండాలనే ఉద్దేశపూర్వకం కానటువంటి సందేశం పెట్టుబడిదారులకు వెళ్లడం వల్ల విదేశీ నిధుల రాకపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. నిపుణుల కమిటీకి సంబంధించిన అన్ని వివరాలనూ సీల్డ్ కవర్లో అందజేస్తామని అత్యున్నత న్యాయస్థానానికి తెలిపింది. సెబి దాఖలు చేసిన అఫిడవిట్‌లో, షార్ట్ సెల్లింగ్‌ను లేదా బారోవ్డ్ షేర్స్ అమ్మకాన్ని నిషేధించడానికి తాము అనుకూలం కాదని పేర్కొంది. అదానీ గ్రూప్‌పై ఓ చిన్న షార్ట్ సెల్లర్ చేసిన ఆరోపణలపైనా, దాని షేర్ల ధరల కదలికలపైనా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపింది.

సుప్రీం కోర్టు ఈ నెల 10న విచారణ సందర్భంగా, అదానీ గ్రూప్ స్టాక్ పతనం నేపథ్యంలో మార్కెట్ ఒడిదుడుకుల నుంచి భారతీయ పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడాల్సిన అవసరం ఉందని తెలిపింది. దేశంలోని నియంత్రణ వ్యవస్థలను పటిష్టపరచడానికి తీసుకోవలసిన చర్యలను సిఫార్సు చేసేందుకు రిటైర్డు జడ్జి నేతృత్వంలో ఓ డొమైన్ ఎక్స్‌పర్ట్స్ కమిటీని ఏర్పాటు చేయడంపై పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. హిండెన్‌బర్గ్ నివేదిక జనవరి 24న విడుదలైన తర్వాత గౌతమ్ అదానీ నేతృత్వంలోని గ్రూప్ కంపెనీల షేర్లు భారీగా పతనమైన సంగతి తెలిసిందే. ఈ కంపెనీలు ఇప్పటి వరకు 120 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువను కోల్పోయాయి.

విదేశీ ఇన్వెస్టర్లకు మోడీ సమాధానం చెప్పాలి

- బిలియనీర్ జార్జ్ సోరస్

న్యూఢిల్లీ: విదేశీ పెట్టుబడిదారులకు ప్రధాని మోడి సమాధానం చెప్పాలని అమెరికాకు చెందిన బిలియనీర్ జార్జ్ సోరస్ డిమాండ్ చేశారు. ఇటీవల మునిచ్‌లో జరిగిన సెక్యూర్టీ కాన్ఫరెన్స్‌లో భారత ప్రధానిపై సోరస్ విమర్శలు చేశారు. అదానీ గ్రూపు సంక్షోభాన్ని తన ప్రసంగంలో ప్రస్తావించిన సోరస్.. స్టాక్స్ విషయంలో అదానీ మోసాలకు పాల్పడినట్లు హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదికపై పార్లమెంట్‌లో మోడీ వివరణ ఇవ్వాలని అన్నారు. అదానీ సంక్షోభం మోడీని బలహీనపరచనున్నట్లు సోరస్ అభిప్రాయపడ్డారు. అదానీ ఘటనతో వ్యవస్థీకృత సంస్కరణలు చేపట్టాల్సి వస్తుందన్నారు. భారత్‌లో ప్రజాస్వామ్య పునరుజ్జీవనం తప్పదన్నారు. భారత్, రష్యా నుంచి చాలా తక్కువ ధరతో చమురు కొనుగోలు చేసి దానిపై చాలా డబ్బు సంపాదిస్తోందని వ్యాఖ్యానించారు. హిండెన్‌బర్గ్ రిపోర్టు ఇచ్చిన తర్వాత జనవరి 24వ తేదీ నుంచి అదానీకి చెందిన ఏడు కంపెనీలు ఇప్పటి వరకు స్టాక్ మార్కెట్లలో బిలియన్లు కోల్పోయాయి.

సోరస్‌కు సంబంధం లేదు : కాంగ్రెస్

సోరస్ ప్రకటనను కాంగ్రెస్ ఖండించింది. 'అదానీ స్కామ్ భారతదేశ ప్రజాస్వామ్య పునరుద్ధరణకు దారితీస్తుందా అనేది పూర్తిగా కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలు, ఎన్నికల ప్రక్రియపై ఆధారపడి ఉంటుంది. దీనికి సోరోస్ వంటి వ్యక్తులతో సంబంధం లేదు. సోరోస్ వంటి వ్యక్తులు మన ఎన్నికల ఫలితాలను నిర్ణయించలేరు' అని కాంగ్రెస్ పార్టీ ట్వీట్ చేసింది.

సోరస్ ఆర్థిక నేరస్తుడు : బిజెపి

జార్జ్ సోరస్ ఆర్థిక యుద్ధ నేరస్థుడని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఆరోపించారు. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌ను మోసం చేసి, ఆ దేశంతో ఆర్థిక యుద్ధ నేరస్థుడిగా పేర్కొనబడిన వ్యక్తి అని అన్నారు. సోరస్ మోడీపైనే కాకుండా దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి చేస్తున్నారని విమర్శించారు.

ఎమ్మెల్యేల ఎర కేసులో స్టేకు నిరాకరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ ఎమ్మెల్యేల ఎర వ్యవహారంపై దాఖలైన పిటిషన్లను శుక్రవారం సుప్రీం ధర్మాసనం విచారణ జరిపింది. హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కనీసం విచారణ పూర్తయ్యేంత వరకూ ఎవరినీ అరెస్టు చేయవద్దని సిబిఐకు ఆదేశాలు ఇవ్వాలన్న తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనపై కూడా సుప్రీం కోర్టు స్పందించలేదు. సిబిఐను తాము కంట్రోల్ చేయలేమని జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం పేర్కొంటూ తదుపరి విచారణ ఈ నెల 27కు వాయిదా వేసింది.

త్రిపురలో బిజెపి మూకల హింస

అగర్తలా : ఎన్నికల్లో ఓటింగ్ శాతం అధికంగా నమోదవడం, పలు నియోజకవర్గాల్లో ఓటమి సంకేతలు కనిపిస్తుండటంతో బిజెపి గూండాలు దాడులకు తెగబడుతున్నారు. పలు నివాసాలను ధ్వంసం చేశారు. పలుచోట్ల కార్లు, బైకులను తగలబెట్టారు. ఈ దాడుల్లో వందలాదిమంది గాయపడ్డారు. ప్రతి జిల్లా ఆసుపత్రిలోనూ పది మంది వరకూ క్షతగాత్రులు చేరి, వైద్యసేవలు పొందుతున్నారు. సెపాహిజల జిల్లా బిస్లఘర్, గోమతి జిల్లా మతర్బరి, దళాయ్ జిల్లా కమలాపూర్, కొవాయ్ జిల్లా కేంద్రం, పశ్చిమ త్రిపుర జిల్లా ఖయేర్పూర్‌లోని సిపిఎం, కాంగ్రెస్ మద్దతుదారుల నివాసాలపై ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి గూండాలు దాడులకు తెగబడ్డారు. విచక్షణారహితంగా దాడులు చేసి, ఆస్తులను ధ్వంసం చేశారు. ఈ ఘటనల్లో పలువురు గాయాల పాలయ్యారు. కమల్‌పూర్‌లో సిపిఎం కార్యకర్త కారును తగలబెట్టారు. మోహన్‌పూర్‌లో ఉపాధ్యాయుడు సత్యజిత్ ఇంటిపై బిజెపి గూండాల దాడిని నిరసిస్తూ ఉపాధ్యాయులు అగర్తలా పోలీస్ హెడ్ క్వార్టర్స్ వద్ద శుక్రవారం ఆందోళన చేశారు. ఉదయ్‌పూర్ సల్గారాలో బిజెపి గూండాల దాడిలో గాయపడిన ఆశిష్ గంగూలిని మాణిక్ సర్కార్ పరామర్శించారు. సోనామురా నుంచి కాంథాలియా తిరిగి వెళ్తుండగా ఎన్నికల పరిశీలకుడి కారు తగలబెట్టినప్పటికీ ఎన్నికల కమిషన్ ఐదు ఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ప్రకటించడం గమనార్హం.

89.95 శాతం పోలింగ్

త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో 89.95 శాతం పోలింగ్ నమోదయిందని ఎన్నికల కమిషన్ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఓటింగ్‌కు ఉపయోగించిన ఇవిఎంలను 36 స్ట్రాంగ్ రూమ్‌ల్లో భారీ భద్రతా ఏర్పాట్లు మధ్య ఉంచినట్లు ఎన్నికల అధికారులు చెప్పారు. మార్చి 2న ఓట్ల లెక్కింపు జరగనుంది. కాగా, త్రిపురలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 91.32 శాతం పోలింగ్ నమోదయింది. 2013 ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 93 శాతం పోలింగ్ నమోదయింది.

గో గూండాలకు పోలీసుల రక్ష!

జైపూర్ : రాజస్థాన్‌లోని భరత్‌పూర్ జిల్లా పహరి తాలుకా ఘాట్‌మీకకు చెందిన నసీర్ (25), జునైద్ అలియాస్ జునా (35) దారుణ హత్యకు గురి కావడంతో ఆ గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సుమారు రెండు వేల మంది గ్రామస్థులు నిరసన సమావేశం ఏర్పాటుకు ప్రయత్నించగా, పోలీసులు నిరాకరించారు. భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదే గ్రామానికి చెందిన ఉమర్‌ఖాన్‌ను 2017లో గోగూండాలు హత్య చేసిన ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ తరువాత పెహ్లూ, రఖ్బర్, జునైద్‌లను కూడా బలిగొన్నారు. గోగూండాలు, నేరస్తులకు శిక్షలేని వాతావరణాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సృష్టించిందని, అందుకే వారు హత్యలకు పాల్పడుతున్నారని ఉమర్‌ఖాన్ కుమారుడు మక్సూద్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కేసును అపహరణ కేసుగానే పోలీసులు చిత్రీకరిస్తున్నారని గ్రామస్తులు విమర్శించారు.

పోలీసులెందుకు అడ్డుకోలేకపోయారు?

రాజస్థాన్‌లో ఇద్దరు యువకులను అపహరించి, 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న లోహారు కారులో తీసుకొచ్చినప్పుడు ఎక్కడా చెక్ పోస్టులు లేవా? ఎందుకు అడ్డుకోలేకపోయారు? అన్న ప్రశ్నకు పోలీసుల వద్ద సమాధానం లేదు. బజరంగ్‌దళ్ నాయకుడు మోనూ మనేసర్ తన సోషల్ మీడియా ప్రొఫైల్‌లో పశువుల వాహనాలను వెంబడించే విధానం, కాల్పులు జరిపే వీడియోలను పెట్టాడు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే హక్కు ఒక సంస్థకు ఉందా? పోలీసులు, అధికారులు ఎందుకు? అని సామాజిక కార్యకర్త వసీం అక్రమ్ ప్రశ్నించారు.

బాధ్యులను కఠినంగా శిక్షించండి : సిపిఎం

సజీవ దహనం కేసులో దోషులను తక్షణమే అరెస్టు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఆ పార్టీ హర్యానా రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర సింగ్ నేతృత్వంలోని బృందం లోహారులోని సంఘటనా స్థలాన్ని సందర్శించి, వివరాలు తెలుసుకుంది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గోరక్షణ పేరుతో మైనారిటీలపై హింసకు, నేరాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ ఘటన సిగ్గుచేటని అన్నారు. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జమ్ముకాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దుపై పిటిషన్ల లిస్టింగ్‌కు సుప్రీం ఓకే

న్యూఢిల్లీ : జమ్ముకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370లోని నిబంధనలను రద్దు చేస్తూ కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను త్వరగా లిస్టింగ్ చేయడంపై నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు శుక్రవారం వెల్లడించింది. ఈ పిటిషన్లను త్వరగా విచారించాల్సిన అవసరం ఉందని పిటీషన్‌దారుల్లో ఒకరి తరుపున సీనియర్ న్యాయవాది రాజు రామచంద్రన్ ధర్మాసనం ముందు ప్రస్తావించారు. దీనికి ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరిసింహ, జస్టిస్ జెబి పార్ధివాలాతో కూడిన ధర్మాసనం సానుకూలంగా స్పందించింది. ఆర్టికల్ 370 రద్దును సవాల్ చేస్తూ అనేక పిటీషన్లు దాఖలయ్యాయి. వీటి విచారణకు గతంలోనే ఐదుగురు జడ్జిలతో ఒక ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది. ఇందులోని అప్పటి సిజెఐ ఎన్‌వి రమణ, జస్టిస్ ఆర్ సుభాష్ రెడ్డి పదవీ విరమణ చేయడంతో ఈ ధర్మాసనాన్ని మళ్లీ ఏర్పాటు చేయాల్సుంది.

బిబిసి కార్యాలయాల్లో ముగిసిన ఐటి సోదాలు

న్యూఢిల్లీ : బిబిసి కార్యాలయాల్లో ఆదాయపన్ను (ఐటి) శాఖ సోదాలు గురువారంతో ముగిసాయి. న్యూఢిల్లీ, ముంబయిలోని బిబిసి కార్యాలయాల్లో మంగళ, బుధ, గురువారాల్లో మూడు రోజుల పాటు ఐటి శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. ప్రధానంగా సంస్థ ఆర్థిక కార్యక్రమాలపై ఐటి అధికారులు ఆరా తీశారు. బిబిసి కార్యాలయాల్లో ఐటి శాఖ సోదాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బిబిసిపై ఐటి చర్య ద్వారా భారతదేశ ప్రతిష్టను మోడీ ప్రభుత్వం నాశనం చేసిందని కాంగ్రెస్ విమర్శించింది. ఐటి సోదాలపై ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా (ఇజిఐ) ఇప్పటికే ఒక ప్రకటన విడుదల చేసింది. 'ప్రభుత్వ విధానాలను లేదా పాలక వ్యవస్థను విమర్శించే పత్రికా సంస్థలను భయపెట్టడానికి, వేధించడానికి ప్రభుత్వ ఏజెన్సీలను ఉపయోగించే ధోరణికి కొనసాగింపుగానే ఈ సోదాలు ఉన్నాయి' అని ప్రకటనలో తెలిపింది.

ఏక్‌నాథ్ షిండేదే అసలైన శివసేన

- బాణం, విల్లు గుర్తు కేటాయించిన ఇసి

న్యూఢిల్లీ : మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే గ్రూపుదే అసలైన శివసేన పార్టీ అని ఎన్నికల సంఘం గుర్తించింది. షిండే గ్రూపునకే బాణం, విల్లు గుర్తును కేటాయించింది. ఈ మేరకు శుక్రవారం 78 పేజీల ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం శివసేనకు ఉన్న రాజ్యాంగం 'ప్రజాస్వామ్య విరుద్ధం' అని కూడా ఎన్నికల కమిషన్ వ్యాఖ్యానించింది. గత ఉప ఎన్నికల్లో ఉద్ధవ్ థాకరే గ్రూపునకు కేటాయించిన 'ఫ్లేమింగ్ టార్చ్' గుర్తును కొనసాగించుకోవచ్చని తెలిపింది.

ఢిల్లీ మేయర్ ఎన్నికల్లో ఆప్‌కు ఊరట

- నామినేటెడ్ సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనడానికి వీల్లేదు : సుప్రీం

ఢిల్లీ: ఎన్నికల్లో గెలిచి కూడా మేయర్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు ఆటంకాలను ఎదుర్కొంటున్న ఆప్‌కు ఊరట లభించింది. ఢిల్లీ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేషన్‌లోని ఆరు స్టాండింగ్ కమిటీల సభ్యుల ఎన్నికల్లో నామినేటెడ్ సభ్యులకు ఓటు వేసే హక్కు లేదని సుప్రీంకోర్టు శుక్రవారం తీర్పు ఇచ్చింది. ఢిల్లీ చరిత్రలో మేయర్ ఎన్నిక ఇంత ఆలస్యం కావడం ఇదే తొలిసారి. ఫలితాలు విడుదలై రెండు నెలలు గడుస్తున్నా బిజెపి తీరుతో మేయర్ ఎన్నిక వాయిదా పడుతూ వస్తోంది. జనవరి 6, జనవరి 24వ తేదీల్లో, ఫిబ్రవరి 6వ తేదీల్లో బిజెపి, ఆప్ సభ్యుల ఆందోళనలతో మూడుసార్లు మేయర్ ఎన్నిక వాయిదా పడింది. దీంతో, ఆప్ సుప్రీంను ఆశ్రయించింది.

24 గంటల్లో నోటిఫికేషన్

ఆప్ వాదనలతో ఏకీభవించిన సుప్రీం కోర్టు.. నామినేటెడ్ సభ్యులకు ఓటింగ్‌లో పాల్గొనే అర్హత లేదని స్పష్టం చేసింది. 24 గంటల్లో కార్పొరేషన్ సమావేశానికి నోటిఫికేషన్ ఇవ్వాలని, తొలుత మేయర్ ఎన్నిక నిర్వహించాలని ఆదేశించింది. ఆ తరువాత డిప్యూటీ మేయర్, స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికలు మేయర్ అధ్యక్షతన జరుగుతాయని పేర్కొంది. మేయర్‌తోపాటు డిప్యూటీ మేయర్, స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికల్లో ఓటు వేసే హక్కు నామినేటెడ్ సభ్యులకు ఉండదని తెలిపింది. సుప్రీం తీర్పుపై ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ హర్షం వ్యక్తం చేశారు.

బిజెపి తీరుతోనే వివాదం

రెండు నెలల క్రితం జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ (ఎంసిడి) ఎన్నికల్లో ఆప్ స్పష్టమైన మెజారిటీ సాధించింది. మొత్తం 250 వార్డులకుగాను 134 వార్డులను గెలుచుకుంది. అప్పటిదాకా ఎంసిడి పీఠంపై ఉన్న బిజెపి 104 స్థానాలకు పరిమితమైంది. కాంగ్రెస్ పార్టీ 9 వార్డుల్లో విజయం సాధించింది. దాంతో ఢిల్లీ మేయర్ పీఠం ఆమ్ ఆద్మీ పార్టీకే దక్కాలి. ఇక్కడే బీజేపీ కుట్రలకు తెరలేపింది. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా చేత 10 మందిని ఎంసిడికి నామినేట్ చేయించి, వారి చేత మేయర్ ఎన్నికల్లో ఓటు వేయించే ప్రయత్నం చేసింది. ఈ కుట్రపై ఆప్ పోరాడింది. దాంతో మేయర్ ఎన్నిక కోసం ఎంసిడి సమావేశమైన ప్రతిసారి గందరగోళం చోటుచేసుకుంది. దీంతో, మేయర్, డిప్యూటీ మేయర్, ఆరుగురు స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకోకుండానే మూడుసార్లు వాయిదాలు పడ్డాయి. చివరికి ఈ విషయంపై ఆప్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ఆప్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది.





మీకోసం

గంజిలో కొద్దిగా ఉప్పు కలిసి తెల్లని దుస్తులను ఉతికితే మరింత తెలుపును సంతరించుకుంటాయి.

జీవన సౌరభం

పుస్తకం గొప్పతనం అందులో ఉండే విషయం మీద ఆధారపడదు. అది మనకు అందించే ఆలోచన మీద ఆధారపడి ఉంటుంది.

JEEVANA జీవన the family

జనహితం నా భాష

మన మాతృభాష
మనసైన భాష
మన తెలుగు భాష
వెలుగు భాష

తేనెలూరే భాష
తేటయిన భాష
జగతి మెచ్చిన భాష
జనహితము నా భాష

చందమామ చల్లదనం
వెన్నెలమ్మ హాయిదనం
ప్రకృతి పరవశం
మన తెలుగు భాష గొప్పదనం

అన్నమయ్య కీర్తనలో
పోతన భాగవతంలో
వేమన వేదంలో
హాయిగొలుపు తెలుగు భాష

కవిత్రయము కవనంలో
రుద్రమదేవి పౌరుషములో
శ్రీ శ్రీ విప్లవ కవితలలో
సినారె ఆత్మీయ స్పర్శలో
అమరిన మన తెలుగు
ఆనందాల వెలుగు

నండూరివారి ఎంకి అందం
కృష్ణశాస్త్రి భావ కవిత్వం
చలం చూపిన మార్గం
తిలక్ అమృతం కురిసిన రాత్రి
తెలుగు తల్లికి
మల్లెపూల దండ
తెలుగు మనకు
అండ దండ


అన్య భాష మోజులో
మాతృభాషకు దూరం చేస్తూ
తల్లిపాలు తాగి
రొమ్ము గుద్దుతున్నాము
తెలుగు భాష కమ్మదనానికి
భావితరాన్ని దూరం చేస్తున్నాం

- మొర్రి గోపి
8897 882202



తేడాలు గుర్తించండి

పిల్లలూ! ఈ చిత్రంలో ఐదు తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.



నేను గీసిన బొమ్మ





ప్రవీణ్
6వ తరగతి, తెలుగు మీడియం, జడ్పిహెచ్ఎస్, హవేలీ, ఘనాపూర్, మెదక్

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

విస్తృతంగా రాజ్యాంగ ప్రతుల పంపిణీ

దేశంలో ప్రభుత్వం, రాజకీయ పాలన ఎలా ఉండాలో చెబుతూ దేశ నేతలు కలిసి భారత రాజ్యాంగం రచించారు. అణగారిన వర్గాలకు, దోపిడీకి గురవుతున్న ప్రజలకు రాజ్యాంగంలో ప్రత్యేకమైన హక్కులను ప్రకటించింది. ఇందులో పొందుపరిచిన చాలా విషయాలు నిరక్షరాస్యులకు తెలియక పాలకుల దుర్మార్గాలను ప్రశ్నించడం లేదు. వారిపై జరుగుతున్న అన్యాయాల గురించి గొంతెత్తి చెప్పడం లేదు. అది తప్పు అంటూ... ప్రతి ఒక్కరూ రాజ్యాంగం గురించి తెలుసుకోవాలంటోంది అగస్టినా సోరెంగ్. ఓ ఉద్యమంలా రాజ్యాంగ పుస్తకాలను బుక్‌లెట్ రూపంలో ప్రచురించి పంపిణీ చేస్తుంది. ఊరూరా తిరుగుతూ అవగాహన కల్పిస్తుంది. ఈ బృహత్తర కార్యాన్ని తలపెట్టదలచిన పరిస్థితులను తన మాటల్లోనే విందాం.



'మాది జార్కండ్‌లో సిమ్‌డెగా జిల్లాలో మారుమూల గ్రామం. నాకు మొదటి నుంచి పుస్తకాలు చదివే అలవాటు. 21 ఏళ్ల వయస్సులో ఉన్నప్పుడు మలాలా గురించి చదివా. ఆమె ఆడపిల్లల చదువు కోసం చేసిన ఉద్యమం ఎంతగానో ప్రభావితం చేసింది. వాళ్ల నాన్న చూపిన బాటలో నడవడంతో పాటు అక్కడ పరిస్థితులకు ధైర్యంగా నిలబడటం ఎంతో నచ్చింది. మస్తిష్కంలో కొన్ని సంఘటనలు ఇప్పటికీ నిలిచి ఉన్నాయి. చిన్నదైనా ఎంతో నేర్పుతో పోరాటం చేసింది. అప్పుడే నేను ఏమీ చేయలేనా? అని ఆలోచించా.

నా చుట్టూ ఎంతో మంది అమాయకమైన ప్రజలు ఉన్నారు. అందులో మా కుటుంబం కూడా ఉంది. నిత్యం పొట్టపట్టుకుని కూలి పనులకెళతారు. వారు చాలా విషయాల్లో మోసపోతూ, దోపిడీకి గురవుతున్నారు. ఈ విషయం వారికి తెలియదు. అటువంటి వారి కోసం ఏదో ఒకటి చేయాలనుకున్నా. అప్పుడే బాబా సాహెబ్ అంబేద్కర్ జీవిత చరిత్ర చదివా. దాంతో ఆయన రాసిన రాజ్యాంగం పట్ల ఆసక్తి కలిగింది. చదివి అర్థం చేసుకునే ప్రయత్నం చేశా. దానిలో గిరిజనలకు సంబంధించిన హక్కులు గురించి తెలుసుకుని ఆశ్చర్యపోయా. వాటిని నా చుట్టూ ఉన్న ప్రజలకు తెలియజేయాలని, చదువురాని వారికి అవగాహన కల్పించాలని నిర్ణయించుకున్నా.



ఇండియన్ స్కూల్ ఆఫ్ డెమోక్రసీలో చేరి సామాజిక సేవలో భాగస్వామి అవుతున్నా. గ్రామాల్లో హింసకు గురవుతున్న గిరిజన మహిళలు కలిసి మాట్లాడా. లైంగిక, గృహ హింస, దోపిడీకి గురికాకుండా అవగాహన పెంచుతున్నా. వారి సమస్యలు తెలుసుకుని నిత్యం అందుబాటులో ఉంటున్నా. పాఠశాలల్లో ఆడపిల్లలకు, గిరిజనుల వివాహ కార్యక్రమాల్లో రాజ్యాంగం యొక్క గొప్పతనాన్ని చాటి చెబుతూ బుక్‌లెట్లను పంపిణీ చేశా.

నా స్వేచ్ఛ, వ్యక్తిగత హక్కుల కోసం ఇంట్లోవారితో పాటు సమాజంతోనూ ఫైట్ చేయాల్సి వచ్చింది. నేను ప్రేమించిన వ్యక్తిది వేరే కులం. అతన్ని వివాహం చేసుకోకూడదంటూ పెద్దలు వ్యతిరేకించారు. దాంతో మేమిద్దరం కలిసి జీవిస్తున్నాం. ఆ సమయంలో చాలా మంది మా మీద దాడికి ప్రయత్నించారు. మంచి పద్ధతి కాదంటూ కోప్పడ్డారు. దేనికి భయపడలేదు. మా హక్కులు ఏంటో తెలుసుకుని కలిసి నిలబడ్డాం. మా ప్రేమకు గుర్తుగా బాబు పుట్టాడు. ఇప్పుడు వాడికి ఎనిమిదేళ్లు. మా బంధాన్ని చూసి రకరకాలుగా అనుకుంటూంటారు. అవేవి పట్టించుకోకుండా ముందుకెళుతున్నాం.

ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగపై దాడి ఎక్కువైంది. గిరిజన హక్కులను కాలరాస్తున్నారు. ఈ నేపథ్యంలో నేను రాజ్యాంగాన్ని గౌరవిస్తూ... మూడేళ్ల నుంచి ప్రచార కార్యక్రమం చేపట్టా. శిక్షణా తరగతులూ నిర్వహించా. హక్కుల ప్రాముఖ్యత గురించి సమాచారాన్ని అందిస్తున్నా. తెలియని విషయాలు తెలుసుకున్నప్పుడు ప్రజల ముఖంలో కాంతి నన్ను ప్రోత్సహిస్తుంది. కొత్తగా పెళ్లయిన జంటలకు రాజ్యాంగ ప్రతులను కానుకగా ఇస్తున్నా. ఆ దంపతులు చదివి తమ పిల్లలను మెరుగ్గా పెంచుతారని ఆశిస్తున్నా. కమ్యూనిటీ కళాశాల బృందం సహాయంతో గిరిజన మహిళలకు చదువు చెబుతున్నా. వృత్తి కోర్సులు నేర్పిస్తున్నా. సమాజంలో మార్పుకు చేస్తున్న కృషికి ప్రశంసలు వస్తున్నాయి. అధికారులు ప్రత్యేక సేవా కార్యక్రమాలకు ఆహ్వానిస్తున్నారు. గత ఏడాది ప్యారా కెర్కెటా స్మృతి సమ్మాన్ అవార్డు ఇచ్చి, సత్కరించింది. ఇప్పుడు డాక్టర్ రామ్ దయాళ్ ముండా స్మృతి సమ్మాన్‌ని అందజేసింది.'

వేడిని తట్టుకునేలా

బయట వాతావరణం చూస్తే ఎండాకాలం వచ్చినట్లే అనిపిస్తుంది. ఈ వేడిని తట్టుకునేందుకు జీవనశైలిలో మార్పులు అవసరం. లేదంటే ఎండదెబ్బ తగులుతుంది. దాంతో శరీర అవయవ వ్యవస్థలు ప్రమాదానికి గురవుతాయి. అందుకే కొన్ని జాగ్రత్తలు పాటించండి.

- ఇంట్లో వాతావరణం చల్లగా ఉండే విధంగా అక్కడక్కడ మొక్కలు పెట్టాలి.
- ఎండలోకి తప్పనిసరిగా వెళ్లేవారు వదులుగా, కాటన్ వస్త్రాలను ధరించాలి.
- పండ్ల రసాలు, నిమ్మరసం, కొబ్బరి నీళ్ల తాగడం ఆరోగ్యానికి మంచిది. రోజుకు కనీసం నాలుగు లీటర్ల మంచినీరు తాగాలి.
- ఎండలో ప్రయాణించే వారు తలకు టోపి లేదా గొడుగు, హెల్మెట్, గ్లౌజ్‌లు వాడాలి. తీసుకునే ఆహారంలో తగినంత ఉప్పు, నీరు, పోషక విలువలు ఉండాలి.
- ముఖ్యంగా పసి పిల్లలపై ఎండ ప్రభావం పడకుండా చూసుకోవాలి. ఉదయం 9 గంటల నుంచి బయట ఎండలో తిరగకుండా చూలి. గాలి తగిలేలా పలుచని బట్టలు వేయాలి. ఎండలో బయటికి వెళ్లే సమయంలో కళ్లద్దాలు వాడాలి.



- సాధారణంగా వృద్ధులు ఎండాకాలంలో అనేక సమస్యలను ఎదుర్కొంటారు. కొన్ని సమయాల్లో ఎండ వేడిమిని తట్టుకోలేక ప్రాణాలను కోల్పోతుంటారు. వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. దీర్ఘకాలిక సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహాలు పాటించాలి.
- చర్మం బాగా పొడిబారిపోయినప్పుడు చల్లటి నీటితో ముఖం కడుక్కుంటూ ఉండాలి.
- ఎండలో బయటకు వెళ్లడం తప్పదనుకుంటే సన్‌స్క్రీన్ లోషన్‌ను శరీరంపై ఎండ పడే భాగాల్లో రాయాలి.
- తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని కొంచెం కొంచెంగా తీసుకోవాలి. పోషకాలు, నీరు శాతం అధికంగా ఉన్న పుచ్చకాయ, ద్రాక్ష, కర్బూజ లాంటి పండ్లరసాలను ఎక్కువగా తీసుకోవాలి. మధ్యమధ్యలో చల్లని మజ్జిగ, కొబ్బరి నీరు తాగడం మంచిది. దీనివల్ల దేహంలోని వేడి తగ్గి, చర్మం తాజాగా ఉంటుంది.
- కీరదోస, క్యారట్, బీట్‌రూట్ లాంటి పచ్చికూరగాయలను కూడా తినవచ్చు.

అదాని దొంగచాటు దందా..!

న్యూఢిల్లీ : అదాని నౌకాశ్రయాల్లో ఎలాంటి ఒప్పందాలు లేకుండానే దిగుమతుల వ్యవహారాలు చోటు చేసుకుంటున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఒత్తిడి మేరకు ఎలాంటి టెండర్ లేకుండానే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి) గంగవరం పోర్టు ద్వారా దిగుమతులు చేసుకోవడమే ఇందుకు నిదర్శనం. టెండర్ ప్రక్రియ లేకుండానే ఈ వ్యవహారం జరుగుతుందని తృణముల్ కాంగ్రెస్ ఎంపి మహు మొయిత్రా ఆరోపించారు. ఎలాంటి సిగ్గు లేకుండా అదాని కంపెనీలు ఇలాంటి దొంగ చర్యలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. "టెండర్ లేదు, సివిసి విధివిధానాలు లేవు, వైజాగ్ పోర్టు నుంచి గంగవరం పోర్టుకు వ్యాపారాలను తరలిస్తున్నారు." అని చమురు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి, సివిసికి మొయిత్రా ట్వీట్ చేసింది. కాగా.. గంగవరం పోర్టును ఎల్‌పిజి దిగుమతుల కోసం అద్దెకు తీసుకునేందుకు సంబంధించి ఎలాంటి ఒప్పందం చేసుకోలేదని ఐఒసి కూడా స్పష్టతను ఇవ్వడం గమనార్హం. నాన్ బైడింగ్ ఎంఒయుపై సంతకం చేయడం ద్వారా సౌకర్యాలను ఉపయోగించుకుంటున్నట్లు పేర్కొంది. అయితే దీని కోసం ఎటువంటి టెండర్లు మాత్రం పిలువలేదని స్పష్టతనిచ్చింది. ఏడాదికి ఐదు లక్షల టన్నుల సామర్థ్యం కోసం చెల్లింపులు చేయడానికి సిద్ధ పడింది. అది తక్కువ పరిమాణంలో ఉన్నా.. ఆ మొత్తానికి చెల్లింపులు చేయాల్సి ఉండటం గమనార్హం. ఐఒసి ప్రస్తుతం ఏడాదికి దాదాపు 7-8 లక్షల టన్నుల ఎల్‌పిజిని దిగుమతి చేసుకోవడానికి వైజాగ్ పోర్టును ఉపయోగిస్తోంది. ఈ వ్యాపారాన్ని తెరచాటున క్రమంగా గంగవరం పోర్టుకు తరలించడం ద్వారా అదాని పోర్టుకు లబ్ధి చేకూర్చినట్లవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.



అదానికి లబ్ధి చేకూర్చే చర్య : జైరాం రమేష్

అదాని గ్రూపు నిర్వహిస్తున్న గంగవరం పోర్టు నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఐఒసి దిగుమతులు చేపట్టడం అంటే అది అదానికి లబ్ధి చేకూర్చడమేనని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ రంగంలోని వైజాగ్ పోర్టు ఉండగా.. గంగవరం పోర్టును ఉపయోగించడం వెనుక ప్రభుత్వ ఒత్తిడి ఉందన్నారు.

భారత్‌లో ట్విట్టర్ ఆఫీసుల మూత



శాన్‌ఫ్రాన్సిస్కో : సోషల్ మీడియా దిగ్గజం ట్విట్టర్ భారత్‌లోని తన మూడు కార్యాలయాల్లో రెండింటిని మూసి వేస్తున్నట్లు సమాచారం. దేశ రాజధాని ఢిల్లీ, ముంబయిలోని ఆఫీసులను మూసివేస్తుందని రిపోర్టులు వస్తున్నాయి. ఈ కార్యలయాలో పని చేస్తున్న సిబ్బందిని ఇంటి నుంచి పని చేయాలని సూచించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా.. ఎక్కువ మంది టెక్ ఇంజనీర్లు పని చేస్తున్న బెంగళూరులోని కార్యాలయాన్ని మాత్రం కొనసాగించాలని నిర్ణయించింది. ట్విట్టర్‌ను ఎలన్ మస్క్ కొనుగోలు చేసినప్పటి నుంచి అనేక పరిణామాలు చోటు చేసుకుంటున్న విషయం తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా సగం పైగా ఉద్యోగులను తొలగించారు. భారత్‌లో ఏకంగా 90 శాతం మంది సిబ్బందికి కోత పెట్టారు.

రూపాయి డీలా

న్యూఢిల్లీ : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి మారకం విలువ మళ్లీ ఒత్తిడికి గురి అవుతోంది. శుక్రవారం సెషన్‌లో డాలర్‌తో రూపాయి విలువ 14 పైసలు కోల్పోయి 82.84కు దిగజారింది. ఉదయం ఇంతక్రితం సెషన్‌లో 82.70 వద్ద ముగిసింది. దేశీయ మార్కెట్లలో స్తబ్దత, ఎఫ్ఐఐల రాకలో తగ్గుదల రూపాయిని ఒత్తిడికి గురి చేస్తుంది. డాలర్ విలువ పెరగడం, ఆసియన్ మార్కెట్ల పతనం రూపాయి విలువపై ఒత్తిడిని పెంచుతుందని బిఎన్‌పి పరిబాస్‌కు చెందిన షేర్‌ఖాన్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరీ పేర్కొన్నారు. డాలర్ పటిష్టం కావడం ద్వారా రూపాయి విలువ మరింత పడిపోవచ్చన్నారు.

తాడేపల్లిలో మహిళలకు రక్షణ కరువు

- టిడిపి మహిళా అధ్యక్షులు అనిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తాడేపల్లిలో ముఖ్యమంత్రి నివాసం, డిజిపి కార్యాలయాలు ఉన్నప్పటికీ మహిళలకు రక్షణ కరువైందని టిడిపి మహిళా అధ్యక్షులు అనిత విమర్శించారు. ఇటీవల తాడేపల్లిలో హత్యకు గురైన ఎస్తేర్ రాణి హత్యపై జాతీయ మహిళా కమిషన్‌లో శుక్రవారం ఆమె ఫిర్యాదు చేశారు. తాడేపల్లి క్రైం హబ్‌గా మారిందని, డ్రగ్స్‌తో ప్రజల భద్రతకు ముప్పు వాటిల్లుతున్నా పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పోలీసులు ఉదాసిన వైఖరితో గతంలో ఇక్కడ అనేక సంఘటనలు జరిగాయని పేర్కొన్నారు.

ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డిపై చర్యలు తీసుకోండి

- సిపిఎం, సిపిఐ డిమాండ్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రజాస్వామ్య విలువలకు పాతరేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థి గెలుపుకోసం అడ్డదారులు తొక్కుతున్న విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డిపై ఎన్నికల సంఘం తక్షణం చర్యలు తీసుకోవాలని అనంతపురం సిపిఎం, సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. అనంతపురం గణేనాయక్ భవనంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి రాంభూపాల్ మాట్లాడుతూ ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డి అధికారిగా కాకుండా అధికార పార్టీ ఎన్నికల ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వైసిపి ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామచంద్రారెడ్డి సమక్షంలోనే ఉపాధ్యాయ సంఘాలు, ప్రయివేటు స్కూల్ యాజమాన్యాలను రాత్రి సమయాల్లో ప్రయివేటు అతిథి గృహాలకు పిలుచుకుని ఎన్నికల ఎరవేసే ప్రయత్నాలు చేశారని తెలిపారు. ఈ విషయాన్ని ప్రశ్నించడానికి వెళ్లిన విద్యార్థి సంఘం, యువజన సంఘం నాయకులపై బెదిరింపులకు దిగడమే కాకుండా అక్రమ కేసులు బనాయించే ప్రయత్నం చేశారన్నారు. గురువారం రాత్రి మద్యం మత్తులో కనీసం నిలబడలేని స్థితిలో ఆర్‌జెడి ఉన్నారని విమర్శించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందు ఇన్‌ఛార్జిగా వచ్చిన ఆర్‌జెడి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్నారు. అధికార వైసిపికి శాసనమండలి ఎన్నికల్లో ప్రయోజనం చేకూర్చేందుకు విందులివ్వడమే కాకుండా, డబ్బుల పంపిణీకి ఆయనే దగ్గరుండి ప్రణాళిక చేయడం ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందని తెలిపారు. అధికార పార్టీ కోసం నిబంధనలను ఉల్లంఘించిన ఆర్‌జెడిపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవడమే కాకుండా, బాధ్యతల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఒ.నల్లప్ప, నాగేంద్రకుమార్, సిపిఐ నాయకులు రమణయ్య పాల్గొన్నారు.

పేస్‌లో షమి.. స్పిన్‌లో అశ్విన్, జడేజా..

- తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 263పరుగులకే ఆలౌట్
- బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ

న్యూఢిల్లీ: ఫిరోజ్‌షా కోట్లా వేదికగా జరుగుతున్న రెండో టెస్టులోనూ భారత స్పిన్నర్ల జోరు కొనసాగింది. రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా స్పిన్ మాయా జాలానికి పేస్‌లో మహ్మద్ షమీ చెలరేగ డంతో ఆస్ట్రేలియా జట్టు 263 పరుగులకే కుప్పకూలింది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా జట్టు స్కోర్ 50 పరుగులవద్ద తొలి వికెట్‌ను కోల్పోయింది. డేవిడ్ వార్నర్(15) మరోసారి నిరాశపరిచాడు. మరో ఓపెనర్ ఖవాజా(81) అర్ధసెంచరీతో రాణించినా.. స్పిన్ మాంత్రికుడు అశ్విన్ ఒకే ఓవర్‌లో లబూషేన్, స్మిత్‌ను ఔట్ చేసి ఆసీస్‌ను దెబ్బతీశాడు. ఆ తర్వాత ట్రావిస్ హెడ్(12)ను షమీ.. అలెక్స్ క్యారీ(0)ని అశ్విన్ ఔట్ చేయడంతో.. ఆస్ట్రేలియా జట్టు 199కే 6 వికెట్లు కోల్పోయిన కష్టాల్లో పడింది. ఆ దశలో స్పెషలిస్ట్ బ్యాటర్ హ్యాండ్స్‌కాంబ్(72). ఒకవైపు వికెట్లు పడుతున్నా అద్భుత ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. టెయిలెండర్ల సాయంతో స్కోర్‌ను 250కు దాటించాడు. ఏడో వికెట్‌కు కమిన్స్, హ్యాండ్స్‌కోంబ్ కలిసి 59 పరుగులు జోడించారు. ఈ క్రమంలో రవీంద్ర జడేజా ఒకే ఓవర్‌లో కమిన్స్, మర్ఫీని ఔట్ చేసి ఆసీస్‌ను దెబ్బతీశాడు. లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ పని షమీ చూసుకున్నాడు. లియాన్, కుహ్నెమన్‌ను బౌల్డ్ చేయడంతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 263 పరుగుల వద్ద ముగిసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన భారతజట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి వికెట్లేమీ నష్టపోకుండా 21 పరుగులు చేసింది. రోహిత్ శర్మ(13), కేఎల్ రాహుల్(4) క్రీజ్‌లో ఉన్నారు.



షమిని అభినందిస్తున్న టీమిండియా ఆటగాళ్లు

న్యూజిలాండ్ ఘన విజయం


ICC WOMEN'S T20 WORLD CUP SOUTH AFRICA 2023

కేప్‌టౌన్: ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ జట్టు ఘన విజయం సాధించింది. శుక్రవారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టు 71 పరుగులు తేడాతో గెలిచింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 189పరుగుల భారీస్కోర్ చేసింది. ఓపెనర్ బెమడినె(44), బేట్స్(81నాటౌట్) తొలి వికెట్‌కు 77పరుగులు జతచేశారు. చివర్లో గ్రీన్(44నాటౌట్; 20బంతుల్లో 7ఫోర్లు) కూడా రాణించింది. ఫాతిమా ఖాతూనుకు రెండు, షోమా అక్తర్‌కు ఒక వికెట్ దక్కాయి. ఛేదనలో బంగ్లాదేశ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 8వికెట్లు కోల్పోయి 118పరుగులే చేయగల్గింది. ముర్షిదా ఖాతూన్(30), షోమా అక్తర్(31) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. ఇడెన్ కార్సన్‌కు మూడు, హన్నాకు రెండు, తహుహు, కెర్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సూజీ బేట్స్‌కు లభించింది.

టి20 ప్రపంచకప్‌లో నేడు..
ఇండియా × ఇంగ్లాండ్(సా.6.30గం॥లకు)
దక్షిణాఫ్రికా × ఆస్ట్రేలియా(రా.10.30గం॥లకు)

ఐపిఎల్ షెడ్యూల్ వచ్చేసింది

మార్చి 31న గుజరాత్-చెన్నై మ్యాచ్‌తో ప్రారంభం, మే 28న ఫైనల్



ముంబయి: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-15 షెడ్యూల్ వచ్చేసింది. భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు (బిసిసిఐ) 2023 సీజన్ ఐపిఎల్ షెడ్యూల్‌ను శుక్రవారం విడుదల చేసింది. మార్చి 31న డిఫెండింగ్ ఛాంపియన్ గుజరాత్ టైటాన్స్, మాజీ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య గుజరాత్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగే తొలి పోరుతో ఈ సీజన్ ఐపిఎల్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ రాత్రి 7.30గం॥లకు జరగనుంది. మే 28న జరిగే ఫైనల్ మ్యాచ్‌తో సీజన్-15 ఐపిఎల్ ముగియనుంది. మొత్తం 12 వేదికల్లో 74 మ్యాచ్‌లు జరగనున్నాయి. అహ్మదాబాద్, మొహాలి, లక్నో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, జైపూర్, ముంబయి, గౌహతి, ధర్మశాల వేదికలుగా ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. పది జట్లు పాల్గొనే ఐపిఎల్ 2023లో 18డబుల్ హెడ్డర్ మ్యాచ్‌లు జరగనుండగా.. రెండు మ్యాచ్‌లు ఉన్నరోజు ఒకమ్యాచ్ మధ్యాహ్నం 3.30గంటలకు, రెండోమ్యాచ్ రాత్రి 7.30గంటలకు ప్రారంభం కానుంది. అలాగే ఏడు మ్యాచ్‌లు సొంత మైదానంలో, మరో 7 వెలుపల స్టేడియాల్లో జరగనున్నాయి. గ్రూప్-ఏలో ముంబయి, రాజస్తాన్, కోల్‌కతా, ఢిల్లీ, లక్నో, గ్రూప్-బిలో చెన్నై, పంజాబ్, సన్‌రైజర్స్, బెంగళూరు, గుజరాత్ జట్లు ఉన్నాయి.

చేతన్ శర్మ రాజీనామా



ముంబయి: బిసిసిఐ చీఫ్ సెలెక్టర్ చేతన్ శర్మ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన పదవికి రాజీనామా చేస్తున్న బిసిసిఐ సెక్రటరీ జై షాకు లేఖ రాశారు. ఆయన రాజీనామాను బిసిసిఐ కూడా ఆమోదించినట్లు సమాచారం. టీమిండియా క్రికెటర్ల ఫిట్‌నెస్‌పై ఇటీవల చేసిన తీవ్ర వ్యాఖ్యలు పెను దుమారం రేపడం చేతన్ శర్మ రాజీనామా కారణంగా తెలుస్తోంది. చేతన్ శర్మ ఇటీవల భారత జట్టులో నెలకొన్న పరిస్థితులపై పలు ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. కొందరు భారత క్రికెటర్లు ఫిట్‌గా లేనప్పటికీ ఇంజక్షన్లు తీసుకుంటున్నారని, వారు తీసుకుంటున్న ఇంజక్షన్లను డోపింగ్ పరీక్షల్లో సైతం గుర్తించలేరని తెలిపాడు. 80 శాతం ఫిట్‌గా ఉన్న ఆటగాళ్లు కీలకమైన మ్యాచ్‌లకు ముందు ఇంజక్షన్లు తీసుకొని పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నట్లుగా చూపి మ్యాచ్‌లు ఆడుతున్నట్లు చేతన్ శర్మ ఆరోపించాడు. అలాగే బిసిసిఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీల మధ్య విభేదాలు ఉన్నాయని, టీమిండియాలో రెండు వర్గాలు ఉన్నాయని.. వాటికి కోహ్లీ, రోహిత్ శర్మ నాయకత్వం వహిస్తారని పేర్కొన్నాడు.

సెమీస్‌కు సుమిత్

చెన్నై: చెన్నై ఓపెన్ ఛాలెంజర్స్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి సుమిత్ నాగల్ ప్రవేశించాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో సుమిత్ 6-1, 6-4తో జే క్లార్డ్(బ్రిటన్)పై వరుససెట్లలో గెలిచాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 506 ర్యాంక్‌లో ఉన్న సుమిత్ ఈ మ్యాచ్‌ను గంటా 22 నిమిషాల్లో ముగించాడు. సెమీస్‌లో నాగల్ అమెరికాకు చెందిన నికోలస్ మొరెనోతో తలపడనున్నాడు. ఇక పురుషుల డబుల్స్ ఫైనల్లోకి భారత్-బ్రిటన్ జోడీ ప్రవేశించింది. శుక్రవారం జరిగిన డబుల్స్ సెమీఫైనల్లో అర్జున్ ఖడే(భారత్)-జే క్లార్క్(బ్రిటన్) జోడీ 7-5, 4-6, 10-8తో చెక్ రిపబ్లిక్‌కు చెందిన పెట్రో-ఆంద్రూ జోడీపై చెమటోడ్చి నెగ్గారు. మరో సెమీస్‌లో భారత టాప్‌సీడ్ జోడీ జీవన్ నెడుంఛేజియన్-శ్రీరామ్ బాలాజీ జోడీ 6-4, 6-7(5-7), 4-10తో సెబాస్టియన్-నీనో చేతిలో పోరాడి ఓడారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68